
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 04.12.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 27 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

• టార్గెట్ వైకాపా

కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశంలలో ఇక ...

## 'రెడ్ల'కే పెద్దపీట

**రాజీకయాల్లో ప్రభంజనాన్ని, సానుభూతిని నమ్ముకున్నోళ్లు ఒక్కసారే నిలవగలరు. అనుభవాన్ని, సమయస్ఫూర్తిని, పరిస్థితులను గమనించే వాళ్లు ఎల్లకాలం నిలవగలరు. అవసరమనుకుంటే కాళ్లు పట్టుకోవాలి, అవసరం తీరాక ఆ కాళ్ళనే లాగేయాలి. ఇదే రాజకీయం. దీనిని బాగా వంటబట్టించుకున్న నాయకుడే చంద్రబాబునాయుడు.**

ఎన్నికలు ముగిసి ఏడాది ఏడు నెలలు కాలేదు అప్పుడే ఆయన 2019 ఎన్నికలను ప్లాన్ చేసుకుంటున్నాడు. 2014ఎన్నికల్లో ఏ జిల్లాల్లో అయితే తన పార్టీ మైనస్‌లో పడిందో ఆ జిల్లాల్లో బలం పెంచుకునేందుకు పావులు కదుపుతున్నాడు. ఎందుకంటే 2014 ఎన్నికల్లో తెలుగుదేశంకు ఏ జిల్లాల్లో అయితే మెజార్టీ సీట్లు వచ్చాయో ఆ జిల్లాల్లో ఈసారి మెజార్టీ సీట్లు వచ్చే అవకాశాలు లేవు. అక్కడ ప్రభుత్వం మీద ఎంతో కొంత వ్యతిరేకత ఏర్పడుతుంది, అది అభ్యర్థుల మీద ప్రభావం చూపుతుంది.

అదీగాక మొన్న ఎన్నికల్లో జిల్లాల వారీగా వేర్వేరుగా ఫలితాలొచ్చాయి. అంతకుముందెప్పుడైనా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒకేరకంగా ఫలితాలు వచ్చేవి. మొన్న మాత్రం కుల ప్రభావం బలంగా కనిపించింది.

(మిగతా 11వ పేజీలో)

నిన్న తిట్ల దండకం... నేడు 'పొగడ్తల దండ'కం!

## జెండా మార్చిన ఆనం

బాబు పంచన చేరారు



**రా**జకీయాలలో నాలుకకు "నరం" వుండదు, నాయకుడికి స్థిరం వుండదు. ఇది అందరికీ తెలిసిన సత్యమే. ప్రస్తుతం రోజూ ఉదయాన్నే జరిగే టివి చర్చల్లో ఈరోజు ఈ పార్టీలో వుండేవాళ్ళు రేపు ఏ పార్టీలో వుంటారో, వుంటున్నారో టివి చూస్తున్న ప్రేక్షకుడికే అర్థంకాని అయోమయ పరిస్థితి నేటి రాజకీయ రంగంలో నెలకొని వుంది. తిట్టే ముందు తాము ఏం మాట్లాడుతున్నామో కూడా తెలియకుండా ప్రతిపక్షాన్ని తిట్టేసి పూనకం వచ్చిన వాళ్లలా వూగిపోయే నేతలు కొద్ది రోజుల్లోనే తమ పంథా మార్చి, జెండాతో పాటు అజెండాను కూడా తమకిష్టమొచ్చిన రీతిలో మార్చేసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనే ఇప్పుడు నెల్లూరు జిల్లాలో జరిగింది. మొన్నటివరకూ జిల్లాలో తిరుగులేని నాయకులుగా వుండడంతో పాటు అధికారపార్టీపై పట్టు కలిగిన వ్యక్తులుగా చెలామణి అయిన "ఆనం" సోదరులు ఒక్కసారిగా అధికార అనాథలుగా మారిపోయారు. గడపల్లో సందడి తగ్గి గుండెల్లో గుబులు పెరగడంతో వారు తిరిగి తమ సొంత గూటికి చేరుకోవడానికి సంసిద్ధమయ్యారు. మొన్నటి వరకు చంద్రబాబు నాలుక తెగ్గొయ్యమన్న వివేకానందరెడ్డి తన నాలుకనే మార్చి 'బాబు' జపం మొదలుపెట్టాడు. ఎట్టకేలకు తమ రాజకీయ భవిష్యత్తుకు కొత్త బాటలు వేసుకునే ప్రయత్నంలో జెండా మార్చి జై తెలుగుదేశం అనేశారు.


(మిగతా 11వ పేజీలో)




GLOBAL HEART & LUNG INSTITUTE
For comprehensive care

గుండె శస్త్ర చికిత్సలు...
ఇప్పుడు సూక్ష్మరంధ్రాల ద్వారా

GLOBAL HEALTH CITY
more to life




**ఉపయోగాలు:** ✦ ఛాతీ ఎముకలోఎటువంటి కోతలు ఉండవు ✦ ఛాతీ ప్రక్క భాగం వైపు 6 నుండి 7 సెం॥మీ ల పరిధిలో చిన్న కోత తక్కువ పరిధిలో రక్త మార్పిడి మరియు ఇన్‌ఫెక్షన్లు 4 రోజులు అంతకన్నా తక్కువ వ్యవధిలోపే హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ ✦ ఆపరేషన్ అనంతరం కోతకు సంబంధించిన అతి చిన్న మచ్చ.

**సమస్యలు:** ✦ గుండె రక్తనాళాలలోపల అడ్డు మరియు ధమనుల కు సంబంధించిన వ్యాధులు ✦ పుట్టుకతో వచ్చిన గుండె లోపాలు ✦ నరములు మరియు ధమనులకు సంబంధించిన వ్యాధులు ✦ థొరాసిక్ మరియు వాస్కులర్ సంబంధిత వ్యాధులు ✦ కుటుంబ సంబంధిత గుండె రక్తనాళాలు మరియు ధమనులకు సంబంధించిన వ్యాధులు ✦ మధుమేహం లేదా బి.పి ✦ హార్మోనుల అసమతుల్యత

**సదుపాయాలు:** ✦ ఎటువంటి హాని లేని పూర్తి భద్రతలో కార్డియాలజీ విభాగము ✦ అధునాతనమైన ఇంపోర్టెడ్ డిజిటల్ ప్యానల్ క్యాత్ ల్యాబ్ ✦ ప్రత్యేక శైలి లో కార్డియాక్ ఆపరేషన్ థియేటర్ ✦ గుండె రక్తనాళాలకు సంబంధించి కొరొనరీ యూనిట్ నందు 24 గం॥లు అంకిత భావంతో పర్యవేక్షణ చేసే బృందం ✦ ఫుల్ టైమ్ అందుబాటులో కార్డియాక్ సర్జన్ ల బృందం. ✦ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజీ ✦ అనస్తీషియా(మత్తుమందు) కు సంబంధించిన వైద్య బృందం.

www.globalhospitalsindia.com

గ్లోబల్ హెల్త్‌సిటీ, 439 చెరన్‌నగర్, పెరుంబాకం, షోలింగ నల్లూరు, చెన్నై - 600100
Ph: +91 - 44 - 4477 7000, Email: infochennai@globalhospitalsinfa.com

గ్లోబల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్, నెం. 16-2-230. క్రిజన్ హైట్స్, సండేమార్కెట్, పొగతోట, నెల్లూరు -1.
ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్: 9989777101,7680931555, 8978788116, 8978788115

UDANAE GLOBAL Emergency Care 24/7
044-4624 2424

# చెరువులకు గండ్లు.. కర్షకుల కడగండ్లు

- ముందు జాగ్రత్తలు తీసుకోని అధికారగణం
- నీటివనరుల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థ అవసరం




జిల్లావ్యాప్తంగా అనేక చెరువుల కట్టలు బలహీనంగా వుండడంతో వానలు, వరదలకు గండ్లు పడి ఆ వెల్లువ నీరంతా పొలాలపై పడడంతో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అనేక ప్రాంతాలు జలమయమై జనం పడిన బాధలు చెప్పనలవి కాదు. పరిస్థితి ఇంత దయనీయంగా వుంటుందని తెలిసినప్పటికీ, జిల్లా అధికారయంత్రాంగం మాత్రం చెరువు కట్టల విషయంలో ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం దారుణం. దాదాపు నాలుగేళ్ళుగా పంటపొలాలకు అదునుకు పదునైన వానలు లేక రైతులు పడిన కష్టాలు వర్ణనాతీతం. వర్షాభావంతో ఇటీవల దాకా చెరువులన్నీ ఎండి బీటలు వారిపోయాయి. అలాంటి సమయంలో చెరువుల పూడిక తీయించడం, చెరువు కట్టలను పటిష్ఠవంతం చేయడం, గతంలో వానలు వరదలు వచ్చినప్పుడు ఎక్కడెక్కడ చెరువులకు గండ్లు పడ్డాయో గుర్తించి, ఆ ప్రాంతాలను మరోసారి పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవడం వంటివన్నీ సంబంధిత అధికారులు చేయాల్సిన పని. అయినా, నీటి పారుదల శాఖ అధికారులు కానీ, జిల్లా ఉన్నతాధికారులు కానీ వాటిపై శ్రద్ధ చూపకపోవడంతో, ఎలాంటి ముందుజాగ్రత్తలు తీసుకోకపోవడంతో భారీ వర్షాలకు అనేకచోట్ల చెరువులకు గండ్లు పడి చెరువుల్లో నిండిన నీరంతా వృధాగా వెళ్ళి పోయింది. తమ కళ్ళముందే చెరువుల్లోని నీరంతా వరదలా వెళ్ళిపోతుంటే కర్షకుల గుండె చెరువైంది. మొన్నమొన్నటిదాకా వర్షాలు లేకపోవడంతో పంటలు వేసుకోవడం ఎట్లా అని వాపోయి, యజ్ఞాలు యాగాలు చేసుకున్న రైతులు, ఇప్పుడు వచ్చిన భారీ వానలకు చెరువులన్నీ నీటితో నిండిపోయి కళకళలాడిపోతున్నాయని ఆనందిస్తున్న సమయంలోనే, వీడని వానల దెబ్బకు అనేకచోట్ల చెరువులకు గండ్లు పడడంతో ఆ వున్న నీరంతా వృధాగా వెళ్లిపోతుంటే దిగాలుగా చూస్తూ కన్నీరు పెట్టుకున్నారు. ముఖ్యంగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో దాదాపు 60 చెరువులకు పైగానే గండ్లు పడి వున్న నీరంతా వెల్లువలా తరలిపోయిందంటే ఎంత బాధాకరమో అధికారులకు ఎలా తెలుస్తుంది?.. జిల్లావ్యాప్తంగానైతే వందలాది చెరువులు తెగిపోయాయి. అధికారులు చివరినిమిషంలో హడావిడిగా వెళ్ళి గండ్లు పడినచోట ఇసుక బస్తాలో.. లేదా రింగ్‌బండ్‌లు వేసినా ఈ భారీ వర్షాల ధాటికి అవి ఎంతసేపు నిలుస్తాయో తెలియదు. ముందుగానే చెరువు కట్టల పరిరక్షణకు పటిష్ఠమైన చర్యలు తీసుకునివుంటే ఇప్పుడు ఈ దుస్థితి ఎదురయ్యేది కాదు. చెరువు కట్టలకు ఎప్పుడు పూడిక తీయించాలో, ఎలా పటిష్ఠం చేయాలో ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం, ఆయా చెరువు కట్టలు తెగకుండా గ్రామస్థాయి అధికారుల బృందాలకు, స్థానిక యువతకు బాధ్యతలు అప్పగించడం వంటివన్నీ ముందుజాగ్రత్తగా తీసుకునివుంటే బావుండేది. కానీ, ఈ పరిస్థితులను ఎవరూ పట్టించుకోకపోవడంతో వానలు రావడం, చెరువులు నిండడం, కట్టలు తెగిపోయి నీరంతా వెల్లువగా వచ్చి చెరువుకింద వున్న ఆయకట్టు ప్రాంతాలను పంటపొలాలను ముంచెత్తడం, రైతన్నలు లబోదిబోమనడం అంతా జరిగిపోయాయి. అయితే, అంతా అయ్యాక నష్టాల అంచనాల వల్ల ప్రత్యేకించి జరిగేదేమిటో..జనానికి ఒరిగేదేమిటో అందరికీ తెలిసిందే. భారీ వర్షాలు, వరదలు, తుఫాన్ల వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడమంటే అంతా జరిగిపోయాక నష్టాలు అంచనా వేయడం కాదు. ఆ విపత్తులు వచ్చినా వాటిని ముందుజాగ్రత్తలతో ఎదుర్కొని..ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ప్రజలను పరిరక్షించుకోవడమే సముచితమైన మార్గం.

***ముందు జాగ్రత్త ఏదీ?...***

అటు రైతాంగానికీ, ఇటు ప్రజలకు ప్రాణప్రదమైన చెరువులు, గ్రామప్రాంతాల్లో ప్రవహిస్తున్న నదులు, వాగులు వంకలపై ఎల్లవేళలా దృష్టి కేంద్రీకరించి వుండాలి. రైతులకు అవసరమైన సాగునీటినీ, ప్రజలకు తాగునీటినీ ఇచ్చే ఈ నీటి వనరుల పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా నష్టం అపారంగా వుంటుంది. చెరువు కట్టలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైనప్పుడు పూడిక తీయిస్తూ, గట్లు పటిష్ఠం చేస్తుండాలి. ఆ చెరువుల పరిరక్షణ బాధ్యతను సంబంధిత గ్రామస్థాయి కమిటీలకు అప్పగించి, ఎప్పటికప్పుడు జిల్లాస్థాయిలో వాటి స్థితిగతులను సమీక్షిస్తూ, వాటి రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఇలాంటి అవాంతరాలను కొంత మేరకైనా ఎదుర్కోగలం. సాధారణంగా గ్రామాల నడిబొడ్డులోనో, కూతవేటు దూరంలోనో చెరువులు వుంటాయి. అవి నిండి పొంగిపొర్లితే వూళ్ళకు వూళ్ళే మునిగిపోతాయి. ఇక పంటపొలాల సంగతి సరేసరి. ఇంతటి విపత్తు నెత్తిమీద వున్నా, వాటి గురించి సంబంధిత అధికారులు ఏరోజూ శ్రద్ధతో పట్టించుకోకపోవడం దారుణం. కార్యాలయాల్లో కూర్చుని కాగితాల కవిలెకట్టల్లో

(మిగతా 11వ పేజీలో)

## ముగిసిన అంతర్‌జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

పొదలకూరులో నవంబరు 27 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఒకటవ ఆంధ్రరాష్ట్ర అంతర జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ (సబ్ జూనియర్స్) పోటీలు ఆదివారంతో ముగిశాయి. 13 జిల్లాల నుంచి బాల బాలికల జట్లు ఈ పోటీల్లో ఉత్సాహంతో పాల్గొన్నాయి. బాలుర విభాగంలో తూర్పు గోదావరి జట్టు ప్రథమ స్థానం సాధించగా, బాలికల విభాగంలో విశాఖ జట్టు ప్రథమస్థానం సాధించింది. బాలుర విభాగంలో ఫైనల్స్‌కు చేరుకున్న తూర్పు గోదావరి, కర్నూలు జట్లు పోటాపోటీగా ఆడగా, చివరికి తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. అదేవిధంగా బాలికల విభాగంలో విశాఖ, గుంటూరు జట్లు పోటాపోటీగా తలపడగా ఎట్టకేలకు విశాఖ జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో తూర్పు గోదావరి, కర్నూలు, గుంటూరు, చిత్తూరుజిల్లాల క్రీడాకారులకు, బాలికల విభాగంలో విశాఖ, గుంటూరు, కడప, కర్నూలు జట్లకు క్రీడా పోటీల నిర్వాహకులు బహుమతులను అందజేశారు. అనంతరం, ఈ పోటీల్లో పాల్గొన్న 13 జిల్లాల క్రీడాకారుల్లోంచి రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు బాల్‌బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రావు ఈ సందర్భంగా తెలియజేశారు. బాలుర జట్టుకు కెవిఎల్‌వి సాయిసురేష్ (కర్నూలు), డి.రమేష్ (తూర్పు గోదావరి), బి. శేఖర్ (తూర్పు గోదావరి), ఎస్ బాషా (కర్నూలు), టి.నాగబాబు (గుంటూరు), కె.రూపేంద్ర (చిత్తూరు), ఆర్.వేణు(విశాఖ), ఆర్.సురేష్(విజయనగరం), ఎస్‌కె షరీఫ్(పశ్చిమ గోదావరి), ఎన్.వెంకటేష్(నెల్లూరు), పి.ప్రసాద్(నెల్లూరు), ఆర్.ముఖేష్(శ్రీకాకుళం), సిహెచ్ కృష్ణ(తూర్పు గోదావరి) ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, బాలికల జట్టుకు పి.రెహానా బేగం (గుంటూరు), కె.ముత్యాలమ్మ (విశాఖ), కె.దేవిక (విశాఖ), డి.శర్వాణి (గుంటూరు), సిహెచ్ భావన (కడప), ఎస్ నిర్మల (కడప), కె.ఫణితాచౌదరి (కర్నూలు), జెవివిఎస్ వరలక్ష్మి (తూర్పుగోదావరి), బి. కళ్యాణి (కృష్ణా), కె.హర్షిత (నెల్లూరు), ఎం.నిఖిత (చిత్తూరు), ఎస్.వనజ (కర్నూలు) ఆర్.కావ్యశ్రీ (విశాఖ) ఎంపికైనట్లు ఆయన వివరించారు.


## నీళ్ళల్లో మగ్గం... నేతన్నల ఆశలకు పగ్గం

### - కష్టాల సుడిలో వెంకటగిరి



భారీ వర్షాలు వెంకటగిరిని కష్టాల సుడిలో ముంచెత్తాయి. రెండు మూడు విడతలుగా కురిసిన భారీ వానలు వెంకటగిరి ప్రాంతాన్ని వరదల్లో ముంచెత్తాయి. వెంకటగిరి నుంచి నెల్లూరుకు వచ్చే రోడ్డు మార్గాల్లో పలుచోట్ల వరదనీరు ఉప్పొంగడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ భారీ వానల ధాటికి జనం అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా, ఈ ప్రాంతంలోని చేనేతకారులు, బీడీ కార్మికులు, నిరుపేదల పరిస్థితి దయనీయంగా మారింది. మగ్గం గుంటల్లోకి నీళ్ళు చేరడంతో పనులు జరగక నేతన్నలు కన్నీరుపెట్టుకుంటున్నారు. వెంకటగిరి, బంగారుపేట, సవారిగుంట తదితర ప్రాంతాల్లో, ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ళలోకి వరదనీరు వెల్లువగా రావడంతో ఆయా ప్రాంత ప్రజలు అవస్థలకు గురయ్యారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్ళలోకి నీరు వచ్చి, ఇళ్ళల్లో వుండలేక, ఎంతగా నీరు వచ్చినా ఇళ్ళు వదిలిరాలేక ఆయా కుటుంబాలు పడిన వేదన అంతా ఇంతా కాదు. వర్షాలు, వరదలు వచ్చినప్పుడల్లా ఈ ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఇలా అవస్థలు పడుతూనే వున్నా అటు ప్రభుత్వం కానీ, ఇటు నాయకులు, అధికారులు కానీ ముందస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ బాధలు పునరావృతమవుతూనే వున్నాయని ప్రజలు ఆవేదనతో చెప్తున్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, వరద నీరు వెళ్ళేందుకు అనువైన కాలువలు లేకపోవడంతో ప్రతిసారీ వానలు వస్తున్నాయంటే ఇక్కడి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత ప్రాతిపదికపై పటిష్ఠమైన చర్యలు తీసుకుని చేనేతకారులున్న ప్రాంతాల్లో వరదనీటి ప్రవాహం ఇళ్ళలోకి ప్రవేశించకుండా ముందస్తుగా సైడు కాలువలు తవ్వించడం, మగ్గం గుంతల్లోకి నీళ్ళు చేరకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయడం ఎంతో అవసరం. అదేవిధంగా, మొన్నటి వరదలకు ఎక్కడెక్కడ రోడ్డు మార్గాలు కొట్టుకుపోయాయో వాటిని వెంటనే బాగుచేయించి, రవాణా వ్యవస్థ స్తంభించకుండా శాశ్వత ప్రాతిపదికపై గట్టి చర్యలు తీసుకోవాల్సి వుంది. వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను మరింత పటిష్ఠవంతం చేసి మొన్నటి ఇబ్బందులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాల్సి వుంది.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని గూడూరు, చిల్లకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి అక్రమ రవాణాకు వినియోగించే వాహనాలు, నగదు, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.50లక్షలు ఉంటుందని సమాచారం. ఈ విషయమై గత నెల 28న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో నెల్లూరు జిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్ విలేకర్లకు ఆ వివరాలు తెలిపారు. నెల్లూరుజిల్లా సీతారామపురం మండలం భైరవకోన అడవుల్లో వున్న ఎర్ర చందనం చెట్లను అక్రమంగా నరికి దుంగలను దంపులుగా ఏర్పాటు చేసి అక్కడ నుంచి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందుకున్న గూడూరు రూరల్ సిఐ పి.శ్రీనివాసులురెడ్డి, చిల్లకూరు ఎస్సై కె.అంకమ్మ, గూడూరు 2టౌన్ ఎస్సై పి.నరేష్, వారి సిబ్బంది జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో దాడికి సిద్ధమయ్యారు. శుక్రవారం ఉదయం చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్న వాటికి ప్రైవేట్‌గా వస్తున్న టాటా ఇండికాం కారును పట్టుకున్నారు. అందులో ఎర్రచందనం కేసులో వున్న పాత నేరస్తుడు ఉదయగిరి మండలం క్రిష్ణంపల్లి గ్రామానికి చెందిన బైనబోయిన శ్రీనివాసులు, నెల్లూరు పొదలకూరు రోడ్డు నేతాజీనగర్ మొదటివీధిలో కాపుర ముంటున్న షేక్ కబీర్, టిపిగూడూరు మం దలం, ఆంజనేయపురం గ్రామానికి చెందిన చిట్టబోయిన ప్రతాప్‌లను అదుపులోకి తీసు కున్నారు. వీరివెనుక టెంపో ట్రావెల్‌లో వస్తున్న నెల్లూరుకు చెందిన సుబ్బారెడ్డి, చెన్నైకు చెందిన కొనుగోలుదారుడు హాకీంలు పరారయ్యారు. అందులోని 72 ఎర్రచందనం దుంగలు, 4సెల్‌ఫోన్లు, రూ. 2వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

నేరస్తులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బం దిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# వరుణ్‌రెడ్డి - సాయిశ్రీ





కావలి మాజీ యం.యల్.ఏ బత్తిన రామకృష్ణారెడ్డి మునిమనుమడు, జిల్లాలోనే పేరుగాంచిన పాతతరం న్యాయవాది బత్తిన రమణారెడ్డి మనుమడు, ఒక్కనెల్లూరులోనే కాకుండా ఇటు ఆంధ్ర అటు తెలంగాణలలో తన వాదనల ద్వారా తాత, తండ్రిల ఖ్యాతిని మించి మంచిపేరు సంపాదించుకున్న ఈ తరం న్యాయవాది బత్తిన రామకృష్ణారెడ్డి ఏకైక కుమారుడు **వరుణ్‌రెడ్డి** పెళ్ళి **సాయిశ్రీ**తో డిసెంబర్ 2వ తేదీ బుధవారం నెల్లూరులో వైభవంగా జరిగింది. అదే రోజు సాయంత్రం రిసెప్షన్ కూడా విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లోనే జరిగింది.

రామకృష్ణారెడ్డి - విజయశ్రీలకు వరుణ్ ఏకైక కుమారుడు కాగా, బల్లెల శ్రీధర్‌రెడ్డి - సుజాతలకు కూడా సాయిశ్రీ ఏకైక కుమార్తె. వియ్యంకులిద్దరూ పోటీపడి పెళ్ళి, రిసెప్షన్ వేడుకలను అంగరంగ వైభవంగా జరిపారు. మంచి స్నేహసంబంధాలు కలిగిన వ్యక్తులుగా ఇద్దరికీ మంచి పేరుండడంతో కారు మబ్బులు కమ్మినా వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా అధికసంఖ్యలో ఈ రెండు కుటుంబాల ఆప్తులు ఈ రెండు వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వరుణ్ - సాయిశ్రీలకు 'లాయర్' శుభదీవెనలు.



# డ్రైనేజీ లేకే డామేజీ

### ఆరోగ్యశాఖ మంత్రి కామినేని

డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకనే నెల్లూరు నగరం వరదలతో ఇంతగా డామేజీకి గురైందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీన నెల్లూరులో వెంగళరావునగర్, భక్తవత్సలనగర్, అనగుంట కాలనీ, విఆర్‌సి ప్రాంతాలలో ఆయన పర్యటించారు. అక్కడ పరిస్థితులను పరిశీలించిన ఆయన అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలిచ్చారు. ఉన్న డ్రైనేజీలు కూడా వరదలకు పాడయ్యాయని, వెంటనే వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు చొరవతో కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి 1.93లక్షల ఇళ్లు మంజూరు చేయగా, వాటిలో పదివేల ఇళ్లను నెల్లూరు జిల్లాకు కేటాయించామన్నారు. మంత్రి వరద ప్రాంతాల పరిశీలన అనంతరం గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిఎం అండ్ హెచ్‌ఓ లక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి, డాక్టర్ సుధాకర్, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

# బాధితులను పన్నులతో బాధించొద్దు



వరద బాధితులకు ఇంటి పన్ను, కుళాయి పన్నులు మినహాయించి బాధల నుండి వారికి కొంత ఉపశమనం కలిగించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ కోరారు. 2వ తేదీన ఆయన 15వ డివిజన్‌లోని నక్కల సంఘం, ఎడ్లరేవు సంఘం ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలో పన్నుల వసూలుకు కార్పొరేషన్ సిబ్బంది సిద్ధమవుతున్నారని, అయితే ఆ భారం ప్రజలపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. జనచైతన్య యాత్రలు చేస్తున్న తెలుగుదేశం నాయకులు ప్రజలకు ఉపయోగపడే విధంగా రూపాయి పని కూడా చేయడం లేదని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో జి.వెంకటేశ్వరరెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, వి.శరత్‌రెడ్డి, పత్తి చంద్రశేఖర్, విజయరామిరెడ్డి, లక్ష్మీరెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, శంకరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వంగాల శ్రీనివాసులురెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సునీల్‌కు అస్వస్థత



ఆసుపత్రిలో పాశం సునీల్‌ను పరామర్శిస్తున్న బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అనారోగ్యానికి గురయ్యారు. సోమవారం గూడూరు నియోజకవర్గంలో వరద బాధితులను పరామర్శిస్తుండగా కడుపు నొప్పి వచ్చింది. నెల్లూరులోని సింహపురి ఆసుపత్రిలో ఆయనకు చిన్న సర్జరీ చేసారు. ఎమ్మెల్యే ప్రస్తుతం కోలుకుని బాగానే వున్నారు.

గూడూరులోని తన ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న సునీల్‌కుమార్‌ను వైకాపా అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఫోన్లో పరామర్శించగా, అంతకుముందే జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జిల్లా వైకాపా నాయకులు ఆసుపత్రిలో పరామర్శించారు.

### జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు

# గాయత్రి విద్యార్థిని



పొదలకూరులోని గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కె.హర్షిత జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. నవంబర్ 27, 28, 29తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొదలకూరులో నిర్వహించిన 1వ రాష్ట్ర అంతర్‌జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ సబ్‌జూనియర్ బాలబాలికల పోటీలలో హర్షిత అత్యుత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయికి ఎంపికైందని ఆ స్కూల్ కరస్పాండెంట్ చైతన్యకుమార్ తెలిపారు. ప్రిన్సిపాల్ కె.సురేష్, డైరెక్టర్ వీరేపల్లి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తోట మనోహర్, రాష్ట్ర అడ్వైజరీ కమిటీ మెంబర్ డి.రఘురామిరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి పి.రామ్మూర్తిలు హర్షితను అభినందించారు.

### వ్యాపారంలోనే కాదు...

# సేవలోనూ ముందుంటాం!

### వరద బాధితుల పట్ల 'కోమిట్ల' ఔదార్యం



వ్యాపారంలోనే కాదు, కష్టాల్లో వున్నవాళ్లను ఆదుకోవడంలోనూ తాను ముందుంటానని కోమిట్ల గ్రూప్ అధినేత కోమిట్ల రెనిల్‌కుమార్‌రెడ్డి నిరూపించారు. ఇటీవలే 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ యంగ్ ఎన్నారై 'యాత్రాజీని' రవాణా సంస్థను స్థాపించి దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తుండడం తెలిసిందే! తమ సొంతూరైన నెల్లూరును కేంద్రంగా చేసుకుని 'కోమిట్ల' గ్రూప్ ద్వారా వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రస్తుతం చెన్నై, నెల్లూరు జిల్లాలను వరదలు ముంచెత్తిన నేపథ్యంలో రెండు రాష్ట్రాలకు 30లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. వరద బాధితులకు ఆపత్కాలంలో అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. హేట్సాఫ్ రెనిల్!




## 'ప్రభా'తం

# అ'సహనం' ఎవరిది?



**ఈ దేశ ప్రజల సహనానికి ఎవరి సర్టి ఫి కేట్లు అవసరం లేదు. 600ఏళ్లుగా పరాయి దేశస్థుల దాడులతో, దండయాత్రలతో తమ గుండెల్లో గునపాలు దించినా ఓర్చుకున్న సహనశీలురు భారతీయులు. ఈ దేశ ప్రజలు అన్ని భాషలను గౌరవించారు. అన్ని మతాలవారితో సహజీవనం చేస్తున్నారు. ఈ దేశంలో సహనం లోపించిందని ఎవరైనా అంటే... వాళ్లు అసహనంతో ఉన్నారని లెఖ్ఖ!**

నూటనలభైకోట్ల జనాభా వున్న చైనాలో అధ్యక్షుడు, ప్రధానిలు ఒకే భాష మాట్లాడుతారు. ఆ దేశ జనాభాకంతా వారి భాష, భావం అర్ధమవుతుంది. అమెరికా అధ్యక్షుడు ఇంగ్లీష్‌లో మాట్లాడుతాడు. అమెరికన్‌లకంతా అర్ధమైపోతుంది. బ్రిటన్ ప్రధాని, జర్మన్ ఛాన్స్‌లర్, జపాన్ అధ్యక్షుడు, పాకిస్థాన్ ప్రధాని... ప్రపంచంలో వున్న అన్ని దేశాల అధినేతలందరూ తమ దేశ ప్రజలకు తెలిసిన భాషల్లోనే మాట్లాడగలరు. ఎందుకంటే దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలలో ఒకే భాషా విధానం వుంటుంది. చైనాలో ప్రజలంతా చైనీ భాషనే మాట్లాడితే, జపాన్‌లో అందరూ జపనీస్ భాషను, పాశ్చాత్య దేశాలలో అందరూ ఇంగ్లీష్‌ను, అరబ్ దేశాలలో అందరూ ఉర్దూను మాట్లాడతారు.

ప్రపంచంలోని ఒక్క భారతదేశంలోనే ప్రతి ఒక్కరూ అర్ధం చేసుకునే పరిస్థితి లేదు. ఎందుకంటే ఇక్కడ రాష్ట్రానికో భాష ఉంటుంది. ప్రధాని ఇంగ్లీష్‌లో మాట్లాడితే దాదాపు 70శాతం మంది దేశ ప్రజలు అర్ధం చేసుకోలేరు. ప్రధాని హిందీలో మాట్లాడితే దాదాపు 50శాతం మంది అర్ధం చేసుకోలేరు. ప్రధాని తమిళం, తెలుగు, కన్నడం, మళయాళీ వంటి ప్రాంతీయ భాషలలో మాట్లాడితే దేశ జనాభాలో 90శాతం మందికి అర్ధం కాదు. అయినా భాష అనేది ఈ దేశాన్ని సమైక్యంగా ఉంచడానికి, ఈ దేశ ప్రజలను సమిష్టిగా ముందుకు నడపడానికి ఏరోజూ అడ్డంకి కాలేదు. భాషలకంటే భావాలే ఈ దేశాన్ని సమైక్యంగా ఉంచుతున్నాయి. భిన్న భాషలు, విభిన్న సంస్కృతుల సంగమంలాంటి భారతదేశం ప్రపంచంలో ఇంకోటి లేదు. ఈ దేశంలో పుట్టడమైనా, ఈ దేశంలో బ్రతకడమైనా అదృష్టమే.

ఇలాంటి దేశంలో బ్రతకలేకపోతున్నామని, భయభ్రాంతులమవుతున్నామని ఈమధ్య కొందరు అవాకులు, చెవాకులు పేలుతున్నారు. 'అసహనం' అనే మాట ఈమధ్య పెద్ద ఫ్యాషనైపోయింది. మేధావుల మని ముద్ర వేయించుకోవాలనుకుంటున్న వాళ్లు 'అసహనం' అనే పదాన్ని చాలా సులభంగా వాడేస్తున్నారు. అసలు అసహనం ఎవరిది? ఎందుకొస్తుంది అనే దానికి సమాధానం లేదు. 125కోట్ల మంది జనాభా వున్న భారత దేశంలో జరిగే చిన్నచిన్న సంఘటనలను భూతద్దంలో చూపిస్తూ, భారతదేశాన్ని ఆఫ్ఘనిస్థాన్, సిరియా వంటి దేశాల పక్కన నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా మత ఘర్షణలు లేవు, కులపోరాటాలు లేవు. మరి దేశంలో ఎలాంటి అలజడులు లేని సమయంలో 'అసహనం' అల్లరి ఎందుకు?

భారతదేశం ప్రజాస్వామ్య పునాదుల మీద నిర్మించబడ్డ ఆధునిక దేవాలయం. అయితే దేశానికి ప్రజాస్వామ్యం కావాలి గాని, అతి ప్రజాస్వామ్యం పనికి రాదు. ప్రతి ఒక్కరికీ వాక్‌స్వాతంత్ర్యం అవసరమే గాని, అది హద్దులు దాటకూడదు. ఈ పరిధులు దాటుతున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతోనే లేనిపోని తల నొప్పులు వచ్చి పడుతున్నాయి. ఒక వ్యక్తిని మనం ఏమండి బాగున్నారా, మీరు చేస్తున్న ఫలానా పని బాగాలేనట్లుంది ఒక్కసారి చూడండి అనేదానికి, ఏం రా బాగున్నావా, నువ్వు ఫలానా పని చేస్తున్నావు, ఏడ్చినట్లే వుంది, మానేయ్ అనే దానికి చాలా తేడా వుంది. రెండో మాటకు ఎవరైనా రియాక్ట్ అవుతారు. ప్రతిచర్య మొదలవుతుంది. ఇలాంటప్పుడు దానిని అసహనం అనగలమా? స్వేచ్ఛ వుందని చెప్పి యం.యఫ్.హుస్సేన్ సరస్వతీదేవి నగ్న చిత్రాన్ని గీయొచ్చు, ఆయనది ఒక అసహనం కాదా? ఆయన చేసిన పనిని నిరసించడం మాత్రం అసహనం క్రిందకు వస్తుందా? ఒక హేతువాది తన వాదాన్ని వినిపించడంలోనూ ఎదుటి వారిని ఒప్పించడంలోనూ తప్పులేదు. కాని వాదనకు ఒక భాష వుంటుంది. దేవుళ్లు లేరని చెప్పడానికి, ప్రజలు పూజించే విగ్రహాల మీద అసభ్యకర పనులు చేయండని చెప్పడానికి చాలా తేడా వుంటుంది. ఈ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినప్పుడే ప్రతిచర్య ఉంటుంది.

విగ్రహాల మీద అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వాళ్లలో అసహనం లేదా? సహనం కోల్పోబట్టే కదా వాళ్లు అలాంటి మాటలన్నది. గోవధను నిషేధించాలన్నది పూజ్య బాపూజీ కల. ఆయన గోమాంసానికి వ్యతిరేకం. మహాత్ముడి సిద్ధాంతాలను చెప్పుకుని ఐదు దశాబ్దాలు ఈ దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌పార్టీ గోవధ నిషేధానికి మాత్రం వ్యతిరేకం. ఇక్కడ మాత్రం ఓట్లు తప్ప గాంధీజీ ఆశయాలతో పని లేదు. దేశంలో గోవులను చంపి తినాల్సిన అవసరం లేదు. ఇతర ఆహారానికి కొరత లేదు. కాని గోవధ వద్దంటే అది అసహనం. గోవులను చంపి తినాలన్న వారిది సహనం. ఇదెక్కడి పద్ధతి. భారతదేశం సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత నుండి పక్కకు తప్పుకోవడమేనా సహనం?!

బాలీవుడ్‌లో పేరుమోసిన నటుడు అమీర్‌ఖాన్ ఈ దేశంపై అసహనం వ్యక్తం చేసాడు. ఈ దేశంలో బ్రతకాలంటే భయంగా వుందని, తన పిల్లలతో బయట దేశాలకు వెళ్దామని తన భార్య అందని ఆయన చెప్పడం విడ్డూరానికే విడ్డూరం. ఈ దేశం ఎంత సహనశీల దేశమో ఆయన తన 'పీకే' సినిమాతోనే గుర్తించి వుండాలి. ఇదే సినిమాను ఆయన పాకిస్థాన్‌లోనో, ఆఫ్ఘనిస్థాన్‌లోనో తీసి విడుదల చేసుంటే భారతదేశం ఎంత సహనం గల దేశమో, ఈ దేశ ప్రజలు ఎంత సహనంగలవారో అర్ధమయ్యుండేది.

ఈ దేశ ప్రజల సహనానికి ఎవరి సర్టిఫికేట్లు అవసరం లేదు. 600ఏళ్లుగా పరాయి దేశస్థుల దాడులతో, దండయాత్రలతో తమ గుండెల్లో గునపాలు దించినా ఓర్చుకున్న సహనశీలురు భారతీయులు. ఈ దేశ ప్రజలు అన్ని భాషలను గౌరవించారు. అన్ని మతాలవారితో సహజీవనం చేస్తున్నారు. ఈ దేశంలో సహనం లోపించిందని ఎవరైనా అంటే... వాళ్లు అసహనంతో ఉన్నారని లెఖ్ఖ!

పార్లమెంటులో సైతం 'అసహనం'పై చర్చ జరిగింది. దేశ వ్యాప్తంగా ఇది చర్చనీయాంశమైంది. కుహనా మేధావులంతా దేశంలో అసహనం పెరిగిపోతోందని తమ అసహనం ప్రకటిస్తున్నారు. ఈ మేధావుల ప్రయత్నాలన్నీ కూడా మొదట్నుంచి ప్రజలను కలిపే విధంగా కాకుండా ఒక వర్గంపై బురద చల్లుతూ ఇంకో వర్గాన్ని దువ్వే విధంగా ఉంటున్నాయి. మతాలను, భాషలను పరస్పరం గౌరవించుకోవడం, ఒకరి మనోభావాలను మరొకరు గుర్తించడం ద్వారానే ఈ దేశంలో సహనం నెలకొంటుంది. మేధావులు ప్రజలకు ఆ విషయాన్ని చెబితే దేశానికి మేలు చేసినవారవుతారు.

# పూలే జీవితం అందరికీ ఆదర్శం



మహాత్మా జ్యోతిరావ్ పూలే జీవితం అందరికీ ఆదర్శమని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని గత నెల28న నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులో వున్న పూలే విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంటరానితనం నిర్మూలన కోసం, దేశవ్యాప్తంగా మహిళల విద్య కోసం పూలే చేసిన కృషి అపారమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం, ఆరంబాక్కం చంద్రశేఖర్, దాసరి విజయకుమార్, దళిత బాబు, బాలచెన్నయ్య, అన్నం దయాకర్‌గౌడ్, రావుల వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలికలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మహాత్మా జ్యోతిరావ్ పూలే కార్యాలయ వ్యవస్థాపకురాలు మల్లి నిర్మల, నూర్ బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు సలీం, నాయకులు ఖాదర్‌బాబు తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా, నగరంలోని కొండాయపాళెంలో వున్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, నగరంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకుడు నూనె మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో జ్యోతిరావ్‌పూలే వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పిట్టి నాగేశ్వరరావు, పద్మజయాదవ్, పిఎల్ రావు, పాముల రమణయ్య, నన్నేసాహెబ్, కిషోర్‌యాదవ్‌లతో పాటు వైద్యులు సునీల్, సిరాజ్, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలి

భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలని, తద్వారా విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంపర్క్ కార్యదర్శి మెంటా రామ్మోహనరావు కోరారు. నెల్లూరు నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత కంఠస్త పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గీతా జయంతిని ప్రభుత్వం జాతీయ పండుగగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పోటీల్లో మొత్తం 280 మంది విద్యార్థులు పాల్గొనగా, 21 మందిని విజేతలుగా ప్రకటించి వారికి బహుమతులను అందజేశారు. ఇక్కడ గెలుపొందినవారు డిసెంబర్ 20 వ తేదిన నెల్లూరులోని మీనాక్షి కల్యాణమండపంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.




# ఆపరేటర్ల పోస్టుల్లో అక్రమాలు

నెల్లూరుజిల్లా విద్యుత్‌శాఖలో షిఫ్ట్ ఆపరేటర్ల నియామకాలలో అక్రమాలు జరిగాయి. ఈ పోస్టులను కూరగాయలు మాదిరిగా అమ్మేసారు. కనీస అర్హతలు లేని వారికి అధికార పార్టీ నేతల సిఫార్సులతో పోస్టులిచ్చారు. 40ఏళ్లు దాటిన వాళ్లకు కూడా పోస్టులివ్వడం అక్రమాలకు పరాకాష్ట. దీనిపై అసెంబ్లీలో చర్చ జరగాలి.

**పద్మప్రియ, నెల్లూరురూరల్.**

# కరపత్రాలు పంచాలి

నవ్యాంధ్రకు ప్రత్యేకహోదా కోసం చేసే ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. ప్రత్యేకహోదా అంటే ఏమిటో దాని వల్ల లాభమేంటో రాజకీయనాయకులకు చాలామందికి అవగాహన లేదు. ఇక మామూలు ప్రజలు హోదా అంటే అదేదో విదేశాల నుండి దిగుమతి చేసుకునే 'మైదా' అనుకుంటున్నారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మామూలు ప్రజలకు అర్ధమయ్యే రీతిలో కరపత్రాలు తయారు చేసి ఇంటింటికి పంచాలి.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

# పార్లమెంటులో ప్రస్తావించాలి

స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయశాఖ కాంట్రాక్ట్ సిబ్బందికి 8 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్ట్ సిబ్బందిని డిప్యుటేషన్‌పై బదిలీ చేసి జిఓను రద్దు చేయాలి. జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులకు జీతాలు పెంచలేదు. తిరుపతి ఎంపీ వరప్రసాద్ ఈ సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించాలి.

**– ఎం.మాధవీలత, తిరుపతి.**

# జాతీయ వాదం హిందుత్వమా?

నరేంద్ర మోడీ మాటంటే జాతీయవాదులకు తారక మంత్రం. జాతీయ వాదాన్ని మాట్లాడితే హిందూత్వ ముద్ర వేస్తున్నారు. కొందరు అభ్యుదయవాదుల ముసుగులో దేశ ద్రోహానికి పాల్పడుతున్నారు. హిందూత్వాన్ని తిట్టడం వీరికి నైజంగా మారింది. వీళ్లు హిందూ సంస్కృతి మీద దాడి చేసినంతగా ఇతర మతాల మీద చేయగలరా? అలాచేస్తే వాళ్లు తాట వలుస్తారు. వాళ్ల వద్ద వీళ్లు చెప్పు క్రింద తేలులా ఉండాల్సిందే! ఆరెస్సెస్ దేశ హితం కోరే జాతీయ వాద సంస్థ. ఈ దేశం కోసం ఆ సంస్థ ఎంతటి త్యాగాలకైనా ముందుంటుంది. కుహనా లౌకికవాదులే ఈ దేశానికి పట్టిన అరిష్టం.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# తమ్ముళ్లు భగభగ






***రాజకీయాల్లో ఎవరి టైం ఎప్పుడు ఎలావుంటుందో చెప్పలేం. కొందరికి మంచికాలం వచ్చిందనుకుంటే అది బ్యాడ్‌టైంగా మారొచ్చు. కొందరు బ్యాడ్ టైంలో ఉన్నామనుకున్నప్పుడు వెంటనే మంచికాలం రావచ్చు. ప్రస్తుతం జిల్లా రాజకీయాలలో కొందరికి గుడ్‌టైం, మరి కొందరికి బ్యాడ్‌టైంను సూచిస్తున్నాయి.***

కాంగ్రెస్ హయాంలో ఆనం సోదరులు పదేళ్లు జిల్లాను శాసించారు. జిల్లా యంత్రాంగాన్ని తమ కనుసైగలతో నడిపించారు. 2014ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోయింది. ఆనం సోదరులు కాంగ్రెస్‌లో వున్నంత కాలం ఇక జీరోలే. 2014ఎన్నికలకు పదిహేనేళ్ల ముందంతా ఏసి సెంటర్ ఎంతో సందడిగా వుండేది. చిన్నచితక నాయకులతో కళకళలాడుతుండేది. 2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది మొదలుకుని ఏసి సెంటర్ వైపు పోయిన నాయకులు లేరు. చివరకు కాంగ్రెస్ వున్నప్పుడు ఆనమోళ్ల సందుల్లో చక్కర్లు కొట్టిన చిన్నచిన్న ఉద్యోగులు కూడా ఈ ఏడాది ఏడునెలల కాలంలో ఆ సందు ముఖం చూడలేదు. ఈ ఏడాది ఏడు నెలల్లో రాజకీయ నిరుద్యోగం ఎలావుంటుందో చూసారు ఆనం బ్రదర్స్. ఇప్పుడు వాళ్లకు మంచి టైం వచ్చింది. తెలుగు దేశంలో వాళ్లు చేరితే ఏసి సెంటర్ మళ్లీ పవర్ సెంటర్ అవుతుంది. ఆనమోళ్లు తెలుగుదేశంలో చేరుతున్నారనగానే ఏసి సెంటర్‌కు పాతకళ మొదలైంది. గతంలో వాళ్ల నుండి దూరంగా వెళ్లిన వాళ్లంతా ఒక్కొక్కరుగా మళ్లీ సెంటర్‌లో కనిపిస్తున్నారు. టీడీపీలో చేరాక వాళ్లకు పదవులు కూడా అవసరం లేదు. అధికారపార్టీలో ఉన్నామనే ఫీలింగ్ చాలు. నెల్లూరు నగరంపై వాళ్లకున్న పట్టు అలాంటిది. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో వాళ్ల స్థాయి నాయకులు లేకపోవడం, వున్న రమేష్‌రెడ్డి లాంటి వారిని డమ్మీలుగా మార్చడం ఆనం బ్రదర్స్‌కు కలిసొస్తుంది.

ఇప్పుడు బ్యాడ్‌టైం ఎవరిదంటే రూరల్, నగర తెలుగుదేశం నాయకులదే! గత పదేళ్లుగా రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, అనురాధ వంటి వారంతా పోరాడింది ఆనం సోదరులతోనే! ఆరోపణలు, విమర్శలు చేసిందంతా వారి మీదనే! ఇప్పుడు పార్టీ అధికారంలో వుంది. ఆనమోళ్ల ముందు కాలరెగరేసుకు తిరుగుదామని వీళ్లు అనుకుంటున్నంతలోనే వూహించని షాక్ తగిలింది. ఆనం వాళ్లు తెలుగుదేశంలో చేరాక ఇక వీళ్లకు పనే ముంది. ఇప్పుడు మనసులో అయినా అనుకుంటారు వీళ్లు... తెలుగుదేశం అధికారంలోకి రాకపోయున్నా మాకీ దౌర్భాగ్యం ఉండేది కాదని!

## వాళ్లను వద్దని ఏం లాభం




ఆనం సోదరులను తెలుగుదేశం పార్టీలో చేర్చుకునే విషయంలో చంద్రబాబు మొక్కుబడిగా నాయకులతో మాటామంతి జరిపారు. కొందరు నాయకులు వివేకాను తీసుకోవద్దని చెబితే చంద్రబాబు వినలేదు. కొందరు భానుశ్రీని, పిండి సురేష్‌ను చేర్చుకోవద్దని చెప్పారు. ఇది రామాయణంలో పిడకలవేట లాగుంది. అసలోళ్లను చేర్చుకునేటప్పుడు ఈ కొసరోళ్లదేముంది. వీళ్లను పార్టీలో చేర్చుకున్నా చేర్చుకోకున్నా వాళ్లుండేది ఆనం బ్రదర్స్‌తోనే! ఈ మాటే చంద్రబాబు కూడా చెప్పాడు. నాయకులు చేరేటప్పుడు అనుచరులు చేరడం కామన్ అని, అనుచరులు రాకుండా నాయకులు వస్తే పార్టీకి ఏం లాభమని ఆయన సముదాయించడంతో వీళ్ల పరిస్థితి ఏమీ అర్ధంకాలేదు.

# వార్నింగ్‌లా వుంటున్న రెడ్‌మార్కింగ్‌లు



నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని అరవిందనగర్, ముత్యాలపాళెం కాలువకట్ట ప్రాంతాల్లో గత నెల 30వ తేదీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలు, రెడ్ మార్కింగ్‌ల పేరుతో నెల్లూరు నగరంలో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, దీనివల్ల ప్రజలు ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోయే అవకాశం వుందని, గుండెజబ్బులతో బాధపడే వారు తీవ్ర ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. కాలువగట్లు మీద నివశించే వేలాది కుటుంబాలకు ప్రభుత్వమే పట్టాలు ఇచ్చి, కరెంటు మీటర్లు ఇచ్చి, సిమెంటురోడ్లు వేసి నేడు కూలగొడతామంటే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రాంతాల్లో జిల్లా మంత్రి నారాయణ, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ స్వయంగా పర్యటించి ప్రజలకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైయస్సార్సీపీ నాయకులు బత్తిన శోభన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రియాజ్, రాఘవరెడ్డి, బాబులు, అశోక్, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణల తొలగింపు జరిగేనా?

## • సర్వత్రా ఉత్కంఠ.. ఆక్రమణదారుల్లో గుబులు



***ఇటీవల కురిసిన వర్షాలు వరదలై నెల్లూరును ముంచెత్తడం పంటకాలువలను ఆక్రమించుకుని ఇళ్ళు, భవంతులు కట్టుకున్నవారి గుండెల్లో గుబులు రేపుతోంది. అధికారులు ఈ ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేస్తుండడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజల్లో కలవరం రేకెత్తుతోంది.***

వరదనీటి ప్రవాహం వెళ్ళేందుకు అనువుగా ఎప్పుడో పురాతన కాలం నుంచి నగరంలో వున్న పంటకాలువలన్నీ కాలక్రమేణా ఆక్రమణల పాలయ్యాయి. అప్పట్లో ఎవరూ పట్టించుకున్నవారు లేకపోవడంతో చెరువు పరిసరాల్లో సైతం అనేకమంది ఇళ్ళు కట్టుకున్నారు. ఇప్పుడు వరదనీటి ప్రవాహంతో నగరంలోని పలు ప్రాంతాలు మునకకు గురవుతుండడంతో ఆక్రమణల అంశం తెరమీదికి వచ్చింది. వరదనీటి ప్రవాహం ఎటూ వెళ్ళేందుకు దారిలేక రోడ్లన్నీ మునకకు గురికావడం, పలు ప్రాంతాల ప్రజలు నానా యాతనలకు గురికావడం తెలిసిందే. ఈ పరిస్థితులన్నిటినీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైతం స్వయంగా వీక్షించారు కూడా. వరదలకు గురైన బాధితులను పరామర్శించి ఆదుకునేందుకు నవంబర్ 20, 21,22 తేదీల్లో నెల్లూరు నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి, ఇక్కడ పంట కాలువలు ఆక్రమణలకు గురైవుండడంతో వరదనీటితో పలుప్రాంతాలు జలమయం కావడాన్ని గమనించారు. నగరంలోని పంటకాలువలు ఇలా ఆక్రమణలకు గురికావడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు కాలనీలు మునకకు గురికావడం ఈ దురాక్రమణల వల్లేనని, వెంటనే ఈ ఆక్రమణలను తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో, అధికారయంత్రాంగం ఆక్రమణల తొలగింపునకు రంగంలోకి దిగడంతో పంటకాలువలను ఆక్రమించి పెద్దపెద్ద భవంతులు కట్టుకున్న ఆక్రమణలదారులు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు ఈ ప్రాంతాల్లో ఎంతోకాలం నుంచి నివాసం వుంటున్న నిరుపేదలు తమ పరిస్థితి ఏమవుతుందోనని తీవ్ర ఆవేదనలో వున్నారు. ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించేందుకు రంగం సిద్ధం కావడంతో ఆయా ప్రాంతాల్లో కలకలంగా వుంది. కాలువలపై పెద్దఎత్తున ఆక్రమణలు వున్నట్లు సర్వేలో గుర్తించడంతో అధికారులు సైతం ఈ ఆక్రమణలను ఎలా తొలగించాలో అర్థం కాక సతమతమవుతున్నారు. అయితే, ఈ ఆక్రమణల తొలగింపు విషయంలో పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని ప్రజాప్రతినిధులు గట్టిగా కోరుతున్నారు.

నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన పంటకాలువలను ఆనుకుని 4863 అక్రమకట్టడాలు వున్నట్లుగా అధికారులు నిర్ధారించడం, ఈ ఆక్రమణలను గుర్తించేందుకు సర్వే బృందాలు హుటాహుటిన సర్వే నిర్వహించడం, మొత్తం 13 ప్రధాన పంటకాలువల్లో 4863 ఆక్రమణలున్నాయని ఆ బృందాలు పేర్కొనడంతో ఆయా ప్రాంతాల్లో వున్న ప్రజల్లో తమ నివాసాల పరిస్థితి ఏమవుతుందోననే ఆందోళన నెలకొంది. అయితే బడాబాబులకు చెందిన ఇళ్ళు మాత్రం కొలతలు తీయకుండా పేదలకు సంబంధించిన ఇళ్లకు మాత్రమే కొలతలు తీస్తున్నారని, ఇలా చేయడం న్యాయం కాదనే విమర్శలూ వస్తున్నాయి. ముఖ్యమంత్రి చెప్పినట్లుగా రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా ఈ సర్వే జరపాల్సి వుంది. కాగా, నారాయణ మెడికల్ కళాశాల ప్రాంతంలో వున్న కాలువ ఆక్రమణ సంగతి ఏమిటని, పంటకాలువల ఆక్రమణల తొలగింపును నిష్పక్షపాతంగా నిర్వహిస్తామన్న మంత్రి నారాయణ ఇందుకు ఏమి సమాధానం చెప్తారని నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. ముంపునకు గురై వున్న ప్రాంతాల్లో పట్టాలు వున్నవారి ఇళ్ళను కూడా తొలగిస్తామని భయపెట్టడం సరికాదని, బడాబాబుల ఇళ్ళ జోలికి వెళ్ళకుండా పేదల ఇళ్ళు తొలగిస్తామంటే సహించేది లేదని, ఆక్రమణల తొలగింపులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన అంటున్నారు. అదేవిధంగా, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ ఆక్రమణలపై స్పందిస్తూ, ఆక్రమణల తొలగింపు పేరుతో పేదలను భయపెట్టవద్దని, నగరం ముంపునకు కేవలం కాలువలపై ఇళ్ళు మాత్రమే కారణం కాదని, నెల్లూరు చెరువు వరదను ఇతర ప్రాంతాలకు మళ్ళించేలా శాస్త్రీయ విధానాలపై ఆలోచనలు చేయాలని సూచిస్తున్నారు. కాలువల్లో పొరుదల ఆగిన ప్రాంతాల్లో మాత్రమే అవసరమైన మేర ఆక్రమణలను తొలగించి, వారికి ప్రత్యామ్నాయ స్థలాలను చూపాలని, ఆ మేరకు ప్రజల్లోకి వెళ్ళి మంత్రి, మేయర్ ప్రజలకు తగిన మనోధైర్యం కల్పించాలని ఆయన కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పంట కాలువలపై వున్న ఆక్రమణలను ఏ మేరకు తొలగిస్తారో అనూహ్యంగానే వుంది. ఈ ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగించడం సాధ్యమయ్యే పనేనా అని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆక్రమణలంటూ తొలగించడం జరిగితే పంటకాలువలు నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల మీదుగా కూడా వెళ్తుంటాయి కనుక, ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే ఎంతోకాలం నుంచి కట్టుకుని వున్న ఇళ్ళను, లేదా భవంతులను తొలగించడం ఏ మేరకు వీలవుతుందనే విషయం సర్వత్రా ప్రజల్లో చర్చనీయాంశంగా వుంది. ఈ విషయంలో అటు ప్రజాప్రతినిధుల, ఇటు అధికారులు అందరూ కలసి సంయమనంగా వ్యవహరించి, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సర్వే జరిపించి తగు నిర్ణయాలు తీసుకోవడం అవసరం. వానలు వరదల ధాటికి జనావాస ప్రాంతాలు నీటి ముంపునకు గురికాకుండా వరద నీరు యధేచ్ఛగా వెళ్లేందుకు వున్న పంట కాలువలు ఎంతోకాలం నుంచి ఆక్రమణలకు గురికావడం విచారకరం. ఇందువల్ల వరద నీటి ప్రవాహం వచ్చినప్పుడు అక్కడ నివాసాలు వున్నవారికి, నగరంలోని పలు ప్రాంతాలకూ ముప్పు పొంచి వుంటుంది. కనుక, ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా కాలువల ఆక్రమణలు తొలగించడం అవసరం. అయితే, ఏ మేరకు ఆక్రమణలు తొలగించాలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, స్థానికంగా వున్న పెద్దలు అందరి సలహాలు, సంప్రదింపులతో సంయమనంగా ఆలోచించి తగు నిర్ణయాలు తీసుకోవడం సముచితం. ఈ విషయంలో నిరుపేదలు, సామాన్యులకు అన్యాయం జరగకుండా, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడం మానవతా ధర్మం కూడా.

# డేంజర్... యమ డేంజర్

**• మాగుంట లే అవుట్ డివైడర్**



నెల్లూరు మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జి వద్ద వుండే డివైడర్ కార్లకు యముడిలా బెంబేలెత్తిస్తోంది. మాగుంట లే అవుట్ అండర్‌బ్రిడ్జి నుంచి మినీబైపాస్ ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఉన్న డివైడర్‌ను ఢీకొని ఈ మధ్య కాలంలో ఎన్నో కార్లు తుక్కుతుక్కయ్యాయి. ఆ ప్రాంతంలో డివైడర్ ఎంట్రన్స్‌లో ఎలాంటి సూచిక బోర్డు గాని, ప్రమాదాన్ని సూచించే గుర్తు కాని లేకపోవడంతో అండర్‌బ్రిడ్జి నుంచి వేగంగా వచ్చే వాహనాలకు డివైడర్ ఎంట్రన్స్ సరిగా కనపడక ఢీకొంటున్నాయి. రెండు వారాల క్రితం రెండు కార్లు ఒకటి వెంబడి మరొకటి డివైడర్‌ను ఢీకొని టైరు పంచరు కావడం, రేడియేటర్ పగిలిపోవడం జరిగింది. వారం క్రితం మరో కారు అదే స్పాట్‌లో డివైడర్‌ను ఢీకొని ఇంజన్, రేడియేటర్స్ టైర్లు దెబ్బతిన్నాయి. తాజాగా సోమవారం ఓ ఇన్నోవా కారు డివైడర్ పైకి ఎక్కడంతో ట్రాఫిక్‌కు అంతరాయమైంది. డివైడర్‌కు ఉత్తర భాగంలో ఉండే దుకాణాల వద్ద పలు ద్విచక్రవాహనాలు రోడ్డుమీదే పార్కు చేసి ఉండడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో డివైడర్‌ను కార్లు ఢీకొంటున్నాయి. వెంటనే అక్కడ ప్రమాద సూచికలు, లేదా అండర్‌బ్రిడ్జికి సమీపంలో స్పీడుబ్రేకర్లు వేసి పెయింట్ చేసి వాహనదారులకు అర్థమయ్యే విధంగా ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగక ముందే సరైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# అమ్మ ఫర్నీచర్‌లో లక్కీడిప్



నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని అమ్మ ఫర్నిచర్‌మాల్‌లో గత నెల 28న లక్కీడిప్ నిర్వహించారు. మాల్‌లో ఇంటర్నేషనల్ ఎక్స్‌పో-2015 పేరిట నిర్వహించిన ప్రదర్శనలో వస్తువులను కొనుగోలు చేసిన వినియోగదారుల కూపన్లకు సంబంధించి 9వ డ్రా తీసారు. మాల్ అధినేత గద్దం సుధాకర్‌రెడ్డి డ్రాను తీసి నెల్లూరునగరంలోని కోటమిట్టకు చెందిన కె.శ్రీనివాసులు(కూపన్ నెం.1587)కు టివిఎస్ జూపిటర్ బైక్ వచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా షాపింగ్‌మాల్ మేనేజింగ్ డైరెక్టర్లు గద్దం సుమన్‌రెడ్డి, సుజన్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రతియేడాది లక్కీడిప్‌ను నిర్వహించి తమ వినియోగదారులకు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు.

# అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



నెల్లూరు నగరంలోని వేదాయపాళెంలో వెలసి వున్న శ్రీ అయ్యప్ప స్వామికి ఆదివారం వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పూజా మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో శీవేలి ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీ స్వామి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమం, హారతులు, ప్రత్యేక పూజలు కన్నుల పండువగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

# నెల్లూరు కబుర్లు

# వివేకాకు మళ్లీ ఫోన్లు

2014 ఎన్నికలకు కొన్ని రోజులకు ముందు నుండే ఆనం వివేకాను చాలామంది అనుచరులు వదిలి వెళ్లిపోయారు. వీరిలో చాలామంది ఆనంను వదిలేసి మంచి పని చేసామని అనుకున్నారు. కాని ఇప్పుడు ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరడంతో సీన్ రివర్స్ అయ్యింది. మొన్నటి వరకు వివేకాను వదిలేసిన నాయకులలో చాలామంది ఏసి సెంటర్‌లో కనిపిస్తున్నారు. కొందరైతే వివేకా నుండి పిలుపు వస్తే ఆయనకు దగ్గర కావాలనుకుంటున్నారు. నగరంలో వుంటున్న ఓ పాత అనుచరుడు వివేకాకు ఫోన్ చేసి, ఏం బాసు... పార్టీలో చేరే రోజున జనాన్ని తీసుకురమ్మంటావా అని అడిగాడు. దానికి వివేకా... అవసరం లేదులే అని బెట్టుసరిగా చెప్పి ఫోన్ కట్‌చేసాడు. మొన్నటి వరకు మౌనవ్రతం పాటించిన వివేకా ఫోన్ ఇప్పుడు మళ్లీ మోగుతోంది. అంతా అధికారం మహిమ.

### నెల్లూరు బురదంతా

# మాగుంట లే అవుట్‌లోనే!



ఆమధ్య ఢిల్లీలో ఓ కేంద్రమంత్రి గారి స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించిన తీరు గురించి పత్రికల్లో చూసి జనం ఆశ్చర్యపోయారు. దాని సారాంశమేంటంటే కుండీలలో వున్న చెత్తను క్లీన్‌గా వున్న రోడ్డు మీద వేయించి ఆ మంత్రి గారు ఆ చెత్తను చీపురుతో వూడుస్తూ ఫోటోలు తీయించుకుని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని 'మమ' అనిపించారు. నెల్లూరులో నగరపాలక సంస్థ వాళ్లు చేస్తున్న క్లీనింగ్ కార్యక్రమం కూడా ఇలాగే వుంది. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అన్ని రోడ్లల్లో, వీధుల్లో బురద పేరుకుపోయింది. అధికారులు ప్రత్యేకశ్రద్ధతో ప్రొక్లెయిన్‌లు, టిప్పర్లు పెట్టి ఈ బురదను ఎత్తేయించారు. ఇంతవరకు బాగానే వుంది. అయితే ఈమధ్య ఒకరోజు అర్ధరాత్రి ఈ బురదనంతా తెచ్చి మాగుంట లే అవుట్‌లోని ఎస్‌ఆర్‌కె స్కూల్ వెనుకరోడ్‌లో తోలబోయారు. మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ వాళ్లు ఈ టిప్పర్లను అడ్డుకుని, ఇప్పటికే దోమలు, పందులతో ఛస్తున్నాం, ఈ బురదంతా మా ఇళ్ల మధ్య తోలితే చావాలా? బ్రతకాలా? అని నిలదీశారు. దీంతో అక్కడ తోలకుండా సిపిఆర్ కళ్యాణ మండపం ఎదురుగా వున్న రిజర్వ్ స్థలంలో బురదంతా పోసారు. అదేమంటే స్థలాన్ని లెవల్ చేసి, దాని మీద కాంక్రీట్ వేస్తామని అక్కడున్న వారికి చెప్పారు. ఇక్కడ బురద వేసేదానికి అది అంతకుముందున్న చోటే వుంచితే మాత్రం ఏ నష్టం.

# బాగుపడిన మార్కెట్ రోడ్

వర్షాల పుణ్యమా అని నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ ముందున్న రోడ్డు కొంతన్నా బాగుపడింది. వర్షాలు రాకముందే ఇక్కడ రోడ్డు గుంతలు పడి ధ్వంసమై, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా వుండింది. వర్షాలు వచ్చాక వరద ప్రవాహంతో ఇంకా పాడైపోయింది. దీంతో ఈ రోడ్డు మీద మంత్రులు, అధికారుల దృష్టి పడింది. మరమ్మత్తులకు నోచుకుని కొంత సౌకర్యవంతంగా మారింది.

# వరద బాధితులకు వాకర్స్ సాయం



నెల్లూరు నగరంలోని శివగిరి కాలనీలో వరదల ధాటికి ఎన్నో ఇబ్బందులు పడుతున్న 250 మందికి నెల్లూరు జిల్లా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయం అందజేశారు. బాధితులకు చీర, జాకెట్లు, దుప్పట్లు, టవల్స్ వగైరాలను పంపిణీ చేశారు. వరద దెబ్బకు విలవిలలాడుతున్న నిరుపేద ప్రజలను ఆదుకోవడం ఎంతో అభినందనీయమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దేవరాల సుబ్రహ్మణ్యాదవ్ అన్నారు. అనంతరం, బాధితుల సహాయార్థం ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ నాయకులు రూ. 35వేల సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవి సుబ్బారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి శేషగిరిరావు, వీఆర్సీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనుమర్లపూడి సుబ్రహ్మణ్యం, జడ్పీ హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### మా పోలీసులు

# బాగా పని చేసారు



ఇటీవల నెల్లూరుజిల్లాలో కురిసిన భారీవర్షాలు, వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడడంలో పోలీసుశాఖ మంచి ప్రతిభ కనపరచిందని రాష్ట్ర డీజీపీ రాముడు ప్రశంసించారు. గత నెల 28న నెల్లూరు పోలీసు అతిథిగృహంలో డీజీపీ జిల్లా పోలీసులతో సమావేశమయ్యారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపులో కష్టపడి పనిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించి నగదు బహుమతులు అందజేశారు. భారీవర్షాల మూలంగా దెబ్బతిన్న నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిశీలనలో భాగంగా పర్యటించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్, అదనపు ఎస్పీలు రెడ్డి గంగాధర్‌రావు, సూరిబాబు, ఎస్పీ, నగర, ఏఆర్, ట్రాఫిక్ డిఎస్పీలు కోటారెడ్డి, మక్బూల్, చెంచురెడ్డి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసి స్టేడియంలో మరమ్మత్తులు

నెల్లూరుజిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలకు నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలోని క్రీడా మైదానం పలుచోట్ల ముంపుకు గురై కోసుకుపోయింది. అస్తవ్యస్తంగా తయారైన ఈ క్రీడామైదానాన్ని గత నెల 28న క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు గ్రావెల్, మట్టితో గుంతలు పూడ్చారు. వరదనీరు తగ్గిపోయి రెండు వారాలవుతున్నా వరద నీరు ఊటలా చేరుతోంది. ఈ నీటిని కాలువల ద్వారా బయటకు మళ్లించారు.

# వదలని వాన

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత నెల 30 (ఆదివారం)న మళ్లీ కుండపోత వాన కురిసింది. సోమ, మంగళవారాల్లోనూ వానలు వదల్లేదు. ఆగినట్లు ఆగి, మళ్లీ కురుస్తూనే వున్నాయి. సోమవారం రాత్రి ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో తెల్లారేసరికి రోడ్లన్నీ నీటి మడుగుల్లా దర్శనమిచ్చాయి. గత కొద్దిరోజులుగా కురిసిన భారీ వర్షాలు ఎట్టకేలకు తగ్గిపోయాయని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో జన జీవనం స్తంభించి పోయింది.

# వేల మెసేజ్‌లు

ఆనం సోదరులను తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవద్దంటూ ఈ జిల్లా నుండి పార్టీ కార్యాలయానికి వేల సంఖ్యలో మెసేజ్‌లు, ఫ్యాక్స్‌లు, ఉత్తరాలు వెళ్లాయి. అయితే ఇవన్నీ కూడా ఆనం సోదరులకు ఇంకొంచెం ప్లస్ అయ్యాయి. టీడీపీ నగర నాయకుల ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదుల పర్వం సాగింది. అయితే ఇన్ని వేల మెసేజ్‌లు రావడంతో ఆనం వాళ్లు ఎంత స్ట్రాంగ్ కాకపోతే ఇంత ప్రతిస్పందన వస్తుందనే ఆలోచనలో అధిష్టానం పడింది. కాబట్టి జిల్లా నాయకుల నుండి ఎంత వ్యతిరేకత వచ్చినా వాళ్లను పార్టీలోకి లాగేసుకున్నారు.

# పెద్దగా కనిపించని హెల్మెట్లు

నవంబర్ 1 నుండి ద్విచక్రవాహనదారులకు శిరస్త్రాణాలు తప్పనిసరి అన్నారు. లేకుంటే జరిమానాలని హెచ్చరించారు. అయితే ఆ సీరియస్‌నెస్ పోయింది. ద్విచక్రవాహనదారుల తలకాయల మీద పెద్దగా హెల్మెట్లు కనిపించడం లేదు. దీనికి కారణం వర్షాలని కూడా చెప్పుకోవచ్చు. ఈ నెలలోనే బాగా వర్షాలు వరదలు రావడం, అన్ని శాఖల అధికారులు వరద సహాయక పనుల్లో ఉండడంతో హెల్మెట్ల సంగతి పట్టించుకునే తీరిక వారికి లేకుండా పోయింది.

# నెల్లూరులో టిటిడి క్యాలెండర్లు

నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కళ్యాణ మండపంలో మంగళవారం నుండి తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి-2016 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు విక్రయిస్తున్నారు. డైరీ రూ. 100లు, 12పేజీల క్యాలెండర్ రూ. 75లు, శ్రీ వెంకటేశ్వరస్వామి కాలెండర్ రూ. 10లు, పద్మావతి, శ్రీ వెంకటేశ్వరస్వామి క్యాలెండర్ రూ. 7లకు విక్రయిస్తున్నారు.

### ఆనం...

# మీ చరిత్ర తెలుసుకోండి

**- పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి**



ఎన్నో కీర్తిప్రతిష్టలు అందుకున్న ఆనం కుటుంబం చరిత్ర తెలుసుకోవాలని, స్వాతంత్ర్య సమరంలో పోరాడిన ఆనం వంశస్థులకు ఎంతో చరిత్ర వుందని పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నెల్లూరు ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆనం సోదరులు తెలుగుదేశంపార్టీలోకి వెళుతున్నారనే వార్త విన్నప్పటి నుంచి తమ రక్తం ఉడికి పోతోందన్నారు. తల తెగి పోయినా ఇలాంటి దిగజారుడు పనులకు తాను పాల్పడనన్నారు. ఆనం రామనారాయణరెడ్డి, ఆనం వివేకానందరెడ్డిలు కాంగ్రెస్‌పార్టీలో ఉన్నతపదవులు అలంకరించి, ఇప్పుడు టిడిపిలోకి వెళ్లేందుకు నారా లోకేష్‌ను, మంత్రి నారాయణను ప్రాధేయ పడతారా? వీళ్లా మీకు నాయకులు అంటూ వీరిని నెల్లూరు ప్రజలు సన్మానం చేయాలని ఎద్దేవా చేశారు. ప్రధాన మంత్రిని, ముఖ్యమంత్రిని, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడును, రాష్ట్ర మంత్రి నారాయణను గురించి ఆనం సోదరులు గతంలో ఎప్పుడెప్పుడు ఏం మాట్లాడారో ఆ సీడీలను చూసిన తర్వాత నాయకులు కాంగ్రెస్ గురించి మాట్లాడాలని సూచించారు. చంద్రబాబు లేఖ ఇవ్వడం వల్లనే రాష్ట్ర విభజన జరిగిందని ఆనం సోదరులు మాట్లాడారని గుర్తుచేశారు. ఈరోజు చంద్రబాబు ఎలా మంచివాడయ్యాడని ప్రశ్నించారు. ఆనం సోదరులు వంచనకు గురైతే ఆత్మద్రోహం చేసుకున్నవారవుతారని పేర్కొన్నారు. వారు చేసింది పెద్ద తప్పిద మన్నారు. అన్ని రకాల పదవులు అనుభవించి పార్టీని విమర్శించడం తగదన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి ఉండేవారే నాయకులన్నారు. కాంగ్రెస్‌లోనే ఎదిగి, ఆ కాంగ్రెస్‌కే భవిష్యత్ లేదంటారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి 2019 నాటికల్లా పూర్వ వైభవం వస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్‌పార్టీ భవిష్యత్తులో మరింత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ముందుకు వెళుతుందన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడారు. నాయకులు పనబాక కృష్ణయ్య, చెంచలబాబుయాదవ్, సివి శేషారెడ్డి, ఉడతా వెంకట్రావు, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఇలాగైతే ప్రమాదాలు జరగవా?!

### తమాషా చూస్తున్న అధికారులు



ఆటోలో ముగ్గురికంటే ఎక్కువమంది ఎక్కకూడదని నిబంధన వుంది. కాని ఈ నిబంధనను ఏ ఆటో డ్రైవర్ పాటిస్తున్నాడు? విద్యార్థులను స్కూలుకు తరలించే ఆటోల్లో పదిమందికిపైగా ఎక్కించుకుంటున్నారు. ఫలితంగా ప్రమాదాలు సంభవించి కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటుండగా మరికొంతమంది తీవ్రంగా గాయపడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసు, రవాణా అధికారులు ప్రమాదం జరిగిన సమయంలో హడావిడి చేయడం తప్ప ఇతర సమయాల్లో తమాషా చూస్తుండడంతో ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నెల్లూరుజిల్లాలో దాదాపు 20వేల ఆటోలుండగా నెల్లూరు నగరంలోనే సుమారు 12వేలకుపైగా ఆటోలు ఉన్నట్లు సమాచారం. ఎక్కువశాతం మంది ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం, డ్రైవింగ్‌లో కనీస పరిజ్ఞానం లేని కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మితిమీరిన వేగం, పరిమితికి మించిన ప్రయాణం ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయి. నెల్లూరు నగరంలో మరీ దారుణం. రోడ్ల మీద గంటలతరబడి ఆటోలు నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఓ ప్రక్క జాతీయ రహదారిపై ఆటోల ప్రయాణాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ, దాన్ని ఎవరూ పాటించడం లేదు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి నెల్లూరు నగరానికి ప్రతిరోజూ వేల సంఖ్యలో ఆటోలు వస్తున్నాయి. వాటిలో ఎక్కువ శాతం జాతీయ రహదారిపైనే నగరంలోకి వస్తున్నా ఏ శాఖ అధికారి కూడా పట్టించుకోవడం లేదు. ఆటో డ్రైవర్లు మితిమీరిన వేగాన్ని తగ్గించుకోవాలి. నిర్లక్ష్యధోరణి విడనాడాలి. మద్యం సేవించి ఆటోలు నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. అభం శుభం తెలియని చిన్నారులను స్కూళ్లకు తీసుకుపోతున్న ఆటోడ్రైవర్లు జాగ్రత్తలు వహించాలి. డ్రైవర్ సీట్లో ఎవరినీ కూర్చోకుండా చూడాలి.

ముఖ్యంగా ఆటోల వల్ల నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువయ్యాయి. ఏ వీధి చూసినా ఆటోలు ఒక దాని పక్కన ఒక్కటి స్కూటర్ పట్టే సందున్నా దూరిపోతూ రోడ్డంతా ఆక్రమించేస్తున్నాయి. నెల్లూరు రోడ్లు రోడ్లుగా కాకుండా ఆటో స్టాండుల్లా తయారవుతున్నాయి. ఒక ఆటో పక్కన ఒక ఆటోనే పోయేలా చేస్తే నగర రోడ్లు చాలా విశాలంగా కనిపిస్తాయి.

### శ్రీసిటీలో ఇసుజు కార్ల

# విడిభాగాల తయారీ కంపెనీ ప్రతినిధులు



ఇసుజు కార్లకు అవసరమయ్యే వివిధ విడిభాగాలను తయారు చేయడానికి ఎంపిక చేయబడ్డ వివిధ దేశ విదేశ కంపెనీల ఉన్నతాధికారుల బృందం మంగళవారం శ్రీసిటీలో పర్యటించింది. సుమారు 180మంది సభ్యులు గల ఈ బృందానికి, శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ఘనస్వాగతం పలికి, శ్రీసిటీలో ఏర్పరచిన వివిధ పారిశ్రామిక వసతుల గురించి, సాధించిన ప్రగతి గురించి వివరించారు. 2016 ఏప్రిల్‌లో ప్రారంభం కావటానికిగాను త్వరితగతిన ముస్తాబౌతున్న ఇసుజు కర్మాగారాన్ని దర్శించటం, ఆ కంపెనీ ప్రతినిధులతో వ్యాపారపరంగా సంప్రదింపులు చేయటం, శ్రీసిటీలోని పారిశ్రామిక ప్రగతిని పరిశీలించి, తమ వ్యాపార పెట్టుబడికి గల అవకాశాలను తెలుసుకోవడమే వీరి పర్యటన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా వారితో రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఇసుజు, కొబెల్కో, హీరో వంటి ఆటోమొబైల్ రంగ దిగ్గజాలు, అనేక ప్రఖ్యాత విడిభాగాల కంపెనీలు శ్రీసిటీలో ఉన్నందున, ఆ తరహా పరిశ్రమలు ఈ ప్రాంతంలో విస్తరించటానికి అనువైన వాతావరణం, ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తుందని, త్వరలో ఈ ప్రాంతం ఒక ఆటోమొబైల్ హబ్‌గా మారుతుందని అన్నారు.

# పోలీసు కుటుంబాలకు చేయూత



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ కుటుంబసభ్యులకు పోలీసుశాఖ నుంచి రావాల్సిన ఆరోగ్యభద్రత మొత్తం రూ.4లక్షల చెక్కును జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ సోమవారం అందజేశారు. జూన్ 5వ తేదీ హెడ్‌కానిస్టేబుల్ మంచికలపాటి బాలాజీసింగ్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించారు. చనిపోయిన పోలీసు కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పి.సుబ్రహ్మణ్యం, సెక్షన్ సూపరింటెండెంట్ సులోచనమ్మ, ఏవో రాజశేఖర్ పాల్గొన్నారు.

### శ్రీశైలం అండ లేకున్నా...

# నెల్లూరు నీళ్ల కుండ సోమశిల



దాదాపు 10ఏళ్లు పైనే అయ్యింది... పెన్నా నదికి వరదొచ్చి సోమశిల రిజర్వాయర్ నిండడం చూసి. 2000 ప్రాంతంలో కర్నాటక రాష్ట్రంతో పాటు కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కురిసిన వర్షాల మూలంగా సోమశిల నిండింది. ఆ తర్వాత సోమశిలకు ఎప్పుడూ పెన్నానది వరద నీళ్లు లేవు. పెన్నలో గత పదేళ్లుగా వరదలు లేవు. 2004లో వై.యస్. సీఎం అయ్యింది మొదలు శ్రీశైలం నీటిని విడుదల చేయడం ద్వారానే సోమశిలను నింపుతున్నారు. వై.యస్. హయాంలోనే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను పెంచడం జరిగింది. దీనిద్వారా ప్రతిఏటా సోమశిల రిజర్వాయర్‌కు నీళ్లొచ్చేవి. కండ్లేరు రిజర్వాయర్‌కు ఈ నీటిని మళ్లించి అక్కడనుండి చెన్నై తాగునీటి అవసరాలకు కూడా విడుదల చేసేవాళ్లు.

అయితే ఎప్పుడూ లేనివిధంగా ఈ సంవత్సరం శ్రీశైలం కూడా ఎండిపోయింది. కర్నాటకలో పెద్దగా వర్షాలు లేవు. ఆ రాష్ట్రంలోని జూరాల, ఆల్‌మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లోనే నీళ్లు లేవు. అక్కడ నుండి దిగువకు నీటిని విడుదల చేస్తే గాని శ్రీశైలంకు నీళ్లు రావు. శ్రీశైలంలో నీటి మట్టం డెడ్‌స్టోరేజ్‌కు పడిపోయింది. అక్కడ నుండి సోమశిలకు చుక్కనీళ్లు వచ్చే పరిస్థితి లేదు. ఈ దశలో కడప జిల్లాలో కురిసిన భారీ వర్షాలు నెల్లూరుజిల్లా రైతాంగాన్ని ఆదుకున్నాయని చెప్పవచ్చు. కడపలో పడ్డ వర్షాల వల్లే అక్కడి వాగులు, వంకలు, పెన్నా ఉపనదులు ఉప్పొంగి సోమశిలకు వరద ప్రవాహమొచ్చింది. 55టిఎంసీల దాకా నీళ్లొచ్చాయి. కండలేరుకు కూడా నీటిని మళ్లించే అవకాశమొచ్చింది. చాలా కాలానికి సోమశిలను స్వచ్ఛమైన పెన్నానది నీళ్లతో చూస్తున్నాము.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# గూడూరు డివిజన్ వార్తలు

## డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసుపత్రి సహకారంతో
# ఉచిత వైద్య శిబిరం



పోటుపాళెం ఎస్టీ కాలనీ గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సి.రోహిణి తదితరులు

గూడూరు మండలంలోని పోటుపాళెం ఎస్టీ కాలనీలో గత నెల 28న ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో వరద బాధితులకు పట్టణంలోని డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి పాల్గొన్నారు. పలువురు గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి ప్రతినిధులు విష్ణువందన, పరమేశ్వరి, డాక్టర్ సుగుణ, లక్ష్మీ పిఎం రావు, వై.లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

## పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
# పేదలకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పొనకా శివకుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణ పరిధిలోని ముంపు బాధిత ప్రాంతాల్లో పేదలకు పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన గత నెల 28న పారిశ్రామికవేత్త, తెలుగుదేశం పార్టీ నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి దాతృత్వంతో దుప్పట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని 28, 29వార్డుల్లో 380మందికి ఈ సాయం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పాల్గొని మాట్లాడుతూ ఆపదలో వున్న పేదలను ఆదుకుంటే వారు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారని, అదే దాతలకు శ్రీరామరక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, రమేష్, శ్రీనివాసులు, మాజీకౌన్సిలర్ కరీముల్లా, తెలుగుదేశంపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రవాణాశాఖలో నిలిచిన సేవలు

భారీవర్షాలకు వరదలు పోటెత్తడంతో గూడూరు సమీపానున్న పురిటిపాళెంకు వెళ్లే దారిలో వున్న గూడూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో కార్యకలాపాలు పదిరోజులుగా పూర్తిగా స్థంభించాయి. గత నెల 16వ తేదీ వచ్చిన పంబలేరు, కైవల్యానది ప్రవాహానికి కార్యాలయంలోని దస్త్రాలు, కంప్యూటర్లు, జనరేటర్, ఇతర దస్త్రాలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం గూడూరు రవాణాశాఖ కార్యాలయంలో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు వాహనదారులకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా నెల్లూరులో పనులు చేస్తున్నట్లు ఆర్టీవో చందర్ తెలిపారు. గూడూరులో త్వరలో సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# వరద బాధితులకు రఘువీరా పరామర్శ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రఘువీరా తదితరులు

జిల్లాలో వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. కైవల్యా నది భారీ వరదల కారణంగా ముగ్గురు కొట్టుకుపోయి చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు ప్రాంతంలో కాంగ్రెస్ నాయకుడు పనబాక కృష్ణయ్య ఆధ్వర్యాన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తులసీరెడ్డి, ఇతర నాయకులతో కలసి ముంపు వరద బాధితులను పరామర్శించి దుస్తులు పంపిణీ చేశారు. వెంకటగిరి నుంచి వచ్చిన ఆయన మండలంలోని తిప్పవరప్పాడు చప్టా వద్ద వరదనీటిలో ముగ్గురు కొట్టుకుపోయిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం చెన్నూరు ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో వరద బాధితులకు దుస్తులు అందజేశారు. వరద సమయంలో జల దిగ్బంధంలో చిక్కుకుపోయిన వేముల పాలెం, గిరిజనకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం గూడూరు రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద బాధిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు, మంత్రులు ఏ ఒక్కరూ పరిశీలించకపోతే బాధితులకు ఎలా సహాయ సహకారాలు అందిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు అసమర్థంగా వ్యవహరించడంతో వరద సాయం కేంద్రం నుంచి ఒక్కపైసా కూడా రాలేదని విమర్శించారు. అదే తమిళనాడులో సీఎం జయలలిత కేంద్రం నుంచి రూ.1000కోట్లు ఆర్థికసాయం తెచ్చి అన్ని విధాలా ఆదుకుంటున్నారని చెప్పారు. భారీవర్షాలు నెల్లూరు, చిత్తూరు జిల్లాలను అతలాకుతలం చేసినా కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబు యాదవ్, వెంకట్రావ్‌యాదవ్, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, బాబురెడ్డి, గోపాలకృష్ణ యాదవ్, కృష్ణారెడ్డి, భవాని నాగేంద్ర ప్రసాద్, గూడూరు పట్టణ కాంగ్రెస్ నాయకుడు ప్రసాద్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే




నెల్లూరుజిల్లా కోట మండలంలోని విద్యానగర్‌లో వున్న యన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రపంచ కంప్యూటర్ లిటరసీ డేను జరుపుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో డా॥ మారుతీపెరుమాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ గురించి, నిజజీవితంలో కంప్యూటర్ ఆవశ్యకత, ఆన్‌లైన్‌లో భద్రతతో కూడిన లావాదేవీలను ఏ విధంగా చేయాలో వివరించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల సీనియర్ ఇంటర్, ఎన్‌బికెఆర్ బిఇడి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా జెఎన్‌టియు ప్రొఫెసర్ డా॥ ఎస్.వి. సత్యనారాయణ, కళాశాల సంచాలకులు డా॥ వి.విజయకుమార్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంధ్ర మహిళా మండలి సామూహిక శ్రీమంతాలు

గూడూరు ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం ద్వారకామయి ఫంక్షన్‌హాలులో సుమారు 50మంది మహిళలకు సామూహిక శ్రీమంతాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ సి.రోహిణి చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. గర్భనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమానికి గూడూరు తహశీల్దార్ సి.వెంకట నారాయణమ్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు విష్ణువందన, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు శ్రీమంతం చేస్తున్న తహశీల్దార్ వెంకటనారాయణమ్మ, ప్రక్కన డాక్టర్ రోహిణి




43వ వర్ధంతి

మా తండ్రిగారైన
శ్రీకంటి వెంకటరత్నం గారు
దైవసన్నిధి చేరి 43 సం॥లు గడిచినా
మీ జ్ఞాపకాలు మా మదిలో
చిరస్థాయిగా నిలిచే వుంటాయి.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

స్వర్గీయ శ్రీకంటి వెంకటరత్నం గారు
ఆడిటర్ & కవి
మరణం : 2-12-1972

మనుమరాలు
వెంకటమంజుప్రీతి - కామేశ్వర్
మునిమనుమడు : ఆర్యన్

| కుమారులు | కోడళ్లు |
|---|---|
| శ్రీకంటి నాగరాజరావు | - మాలతి |
| శ్రీకంటి రామమోహన్‌రావు | - రాజ్యలక్ష్మి |
| శ్రీకంటి రమణమూర్తి | - సీతమ్మ |

| కుమార్తెలు | అల్లుళ్లు |
|---|---|
| కారుమంచి ఇందిర | - అనంతపద్మనాభరావు |
| యరగుడిపాటి వసంత | - ప్రభాకరరావు |
| మద్దాలి వసుప్రద | - వెంకటకృష్ణారావు |

S.V.రత్నం & కో. స్టాఫ్, గూడూరు.


# దేశమే కలాంగారి సంపద - రియాజ్ అహ్మద్

గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్ ఆవరణంలో ఆదివారం మహమ్మదీయన్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో భారతరత్న స్వర్గీయ అబ్దుల్‌కలాం సంతాపసభ జరిగింది. సభలో నెట్‌వర్క్ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ భారత దేశమే సంపదగా కోట్లాది భారతీయుల హృదయాలలో సుస్థిరస్థానం ఏర్పరుచుకుని, శాస్త్ర సాంకేతిక రంగాలలో దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాలకు చాటి సామాన్యుని నుండి అసామాన్యునిగా ఎదిగిన మహామనిషి అబ్దుల్ కలాం అని ఘనంగా నివాళులర్పించారు. కలాం గారి ఔన్నత్యాన్ని వివరిస్తూ వారు చిరస్మరణీయులని కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో నెట్‌వర్క్ కార్యదర్శి హెడ్‌మాస్టర్ మహబూబ్ బాషా, ట్రెజరర్ కరీముల్లా, సభ్యులు, హెడ్మాస్టర్ ఇస్మాయిల్, రియాజ్ అహ్మద్, అన్వర్‌భాషా, రహంతుల్లా,



యూత్ కన్వీనర్ అనీస్ అహ్మద్, ఎఇ మస్తానయ్య, ఔరంగ భాషా, సిఎస్ఎమ్ హైస్కూలు హెడ్‌మాస్టర్ పరంజ్యోతి తదితరులు పాల్గొని అబ్దుల్‌కలాంకు ఘనంగా నివాళులర్పించారు.

## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడతాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. ఖర్చులు పెరుగుతాయి. కాబట్టి ఖర్చులపై అదుపు అవసరం. వృత్తి జీవనం కలవారికి ఆదాయం సంతృప్తికరము. వ్యాపార వర్గాలకు అవకాశాలు తప్పిపోవడం, ఆదాయం తగ్గడం ఉంటుంది. నిర్వహించే వ్యవహారాలను జాగ్రత్తగా నెరపండి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఖర్చులు అదనంగా పెరుగుతాయి. ఋణాలు చేయవలసి రావచ్చును. అధికారులను పబ్లిక్‌ను గమనించుకొని ఉద్యోగులు మెలగవలసి ఉంటుంది. వృత్తి జీవనం కలవారికి, చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమల వారికి ఆర్థికంగా బాగుంటుంది. హోల్‌సేల్ వ్యాపారులు, స్టాకిస్టులకు ప్రభుత్వ వర్గాల నుండి ఇబ్బందులుంటాయి. అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమిస్తారు.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్య ఖర్చులు, ఇంటి ఖర్చులు, ప్రయాణ ఖర్చులు ఎక్కువ కాగలవు. తొందరపడి అతిగా నమ్మకాలు పెంచుకొనవద్దు. బంధుమిత్రులతో సంబంధాలు బలపడతాయి. వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపారవర్గాలకు ఆదాయం పరిస్థితి ప్రస్తుతం సామాన్యంగా ఉంటుంది. రావలసిన బాకీలు కొంత వరకు నెరవేరగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యవహారాలలో మీ ఆధిపత్యం సాగుతుంది. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి జీవనం కలవారికి రాబడి బాగుంటుంది. వ్యాపారవర్గాలకు అభివృద్ధి, ఆదాయం తృప్తికరము. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. కోర్టు కేసులందు అనుకూలత, రావలసిన బాకీలు కొంత లభించుట, కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 04.12.2015 నుండి
తేది. 10.12.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో కుజ రాహువులు, తులలో శుక్రుడు, వృశ్చికంలో శని రవి బుధులు, 6 తేది నుండి ధనుస్సులో బుధుడు, సింహ కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

- తేది 5 శనివారం ఉదయం గంట 10.30 నుండి గంట 11.20లోగా మకరలగ్నంలో శంకుస్థాపనము.

ఇతర ముహూర్తములు లేవు.

### కార్తీక మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 4 | శుక్ర | నవమి | రా॥ గం.5.10వ॥ |
| తేది. 5 | శని | దశమి | పూర్తిగ |
| తేది. 6 | ఆది | దశమి | ఉ॥ గం.7.20వ॥ |
| తేది. 7 | సోమ | ఏకాదశి | ఉ॥ గం.9.30వ॥ |
| తేది. 8 | మంగళ | ద్వాదశి | ప॥ గం.11.34వ॥ |
| తేది. 9 | బుధ | త్రయోదశి | ప॥ గం.1.20వ॥ |
| తేది. 10 | గురు | చతుర్దశి | ప॥ గం.2.25వ॥ |

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఇంట బయట పనుల వత్తిడి వల్ల శ్రమగా ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించగలరు. వ్యాపారాలు బలపడి ఆదాయం పెరుగుతుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. పట్టు విడుపు ధోరణిలో వ్యవహరించడం మంచిది. ముఖ్య పత్రాలు, వస్తువులు జాగ్రత్త పరచుకొనండి.

## మిథునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకొనండి. బిల్డర్లకు, కాంట్రాక్టర్లకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. అనుకున్న పనులకు కొద్ది ఆటంకాలు ఎదురైన మరల సాగుతుంటాయి. శుభకార్య నిర్వహణలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. వ్యాపారవర్గాలకు ఆశించినంత రాబడి, వృద్ధి ఉండదు. వృత్తుల జీవనం గలవారికి ఆర్థికస్థితి కొంత మేలుగా ఉంటుంది.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

నిర్మాణాలు, కొత్త వ్యాపారాల ప్రారంభం జరుగుతుంది. అధికారులకు బాధ్యతలు పెరగడం, స్థానమార్పులుంటాయి. ఆర్థికంగా మంచి అభివృద్ధి కనుపించగలదు. ఆదాయం పెరుగుతుంది. టెన్షన్ తగ్గి స్థిమిత పడతారు. కొత్త పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులు సమర్థతతో నిర్వహిస్తారు. సంఘాలు సమావేశాలలో మీ సలహాలు ఆమోద యోగ్యాలు కాగలవు. వ్యాపారవృద్ధికై చేసే ప్రయత్నాలు సత్ఫలితాలనిచ్చి ఆదాయం పెరుగుతుంది. ఇతరులకు మాట సహాయం, ధన సహాయం చేస్తారు. అవసరాలకు డబ్బు సమకూరుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, బ్యాంకు ఋణాలు లభ్యం కాగలవు.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వస్తు వాహన రిపేర్లు ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు అందుతాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. చేసే పనులలో పొరపాట్లు జరగకుండా చూచుకొనండి. వాహనాలు నడిపేవారు యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా మెలగండి. గృహ నిర్మాణాలు మార్పులు చేర్పులుంటాయి. విద్య బాగుంటుంది. పెద్దమొత్తాలలో ఆర్థిక లావాదేవీలు ఆపండి.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. చిన్న పరిశ్రమలు చిన్న వ్యాపారులకు మంచి అభివృద్ధి ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నం అనుకూలిస్తుంది. ఆంతరంగిక వ్యవహారాలు బయటకు రాకుండా జాగ్రత్త వహించండి. బిల్లులు చెల్లింపులు సకాలంలో జరుపుతారు. చేపట్టిన పనులు సానుకూలం కాగలవు. ఆర్థిక ఇబ్బందులు పరిష్కారం కాగలవు.

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాగలవు. పెట్టుబడుల విషయంలో తొందరపడవద్దు. కుటుంబ బంధువులతో సమస్యలు రాకుండా చూచుకొనాలి. వస్తు వాహన రిపేర్లు ఖర్చులు, శుభకార్య ఖర్చులు ఎక్కువ కాగలవు. వృత్తి జీవనం కలవారికి మంచి ఆర్థికస్థితి, వ్యాపారవర్గాలకు సామాన్య ఆదాయముంటుంది. సంతాన విషయంలో శుభపరిణామాలుంటాయి.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బంధుమిత్రుల సహకారంతో ఒక ముఖ్య పని నెరవేరుతుంది. పెట్టుబడులందు, షేర్లందు అంతగా సంతృప్తి ఉండదు. ఉద్యోగ ప్రయత్నాలు చేయండి, అనుకూలత బాగుంటుంది. ఆర్థికంగా ఇబ్బందులుండినా అవసరాలకు డబ్బు అందుతుంది. వృత్తి పరంగా లాభసాటిగా ఉంటుంది. వైద్య సాంకేతిక రంగాల వారికి వృత్తి పరంగా బాగుంటుంది. రావలసిన బాకీలు అందుతాయి.

# నెల్లూరు వారసత్వ సంపద పరిరక్షణకు నాయకుల ప్రతిజ్ఞ

శ్రీను గల్పిక

విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయం. హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు దేవినేని ఉమ, నిమ్మకాయల చినరాజప్ప, శిద్ధా రాఘవరావు, పరిటాల సునీత, రావెళ్ల కిషోర్‌బాబు, యనమల రామకృష్ణుడులతో సమావేశమై వున్నారు. చంద్రబాబు వారితో... అమరావతి రాజధాని నిర్మాణం నుండి సింగపూర్, జపాన్ దేశాలు వెనక్కి వెళ్లాయి. ఇప్పుడు చైనా ముందుకొచ్చింది. వీళ్లైనా నిలబడతారో లేదోనని ధర్మ సందేహం వ్యక్తం చేశాడు. నిమ్మకాయల చినరాజప్ప అందుకు... ప్రపంచంలో 200 దేశాలున్నాయి సార్, చైనా కాకపోతే సోమాలియా, అది కూడా కాకపోతే ఆఫ్ఘనిస్తాన్, సిరియా... మనకు మాత్రం అర్జంట్‌గా రాజధాని కట్టాలని ఉందా ఏంటి..? ఇలా ఒక్కో దేశాన్ని మార్చుకుంటూ పోతుంటే ఇట్టే కాలం తిరిగిపోతుందని చెప్పాడు. అంతలో అక్కడకు సిఎస్ కృష్ణారావు వచ్చి, సార్, బంగాళాఖాతంలో వాయుగుండం పుట్టింది, నెల్లూరుజిల్లాకు భారీ వర్షాలు, వరదలని చెప్పాడు. అక్కడవాళ్లను అప్రమత్తం చేయండని కోరాడు. వెంటనే చంద్రబాబు... మన మంత్రి నారాయణ ఎక్కడున్నాడని అడిగాడు. నెల్లూరుకు భారీ వర్షాలు చెప్పిన నేపథ్యంలో నారాయణ గారు కూడా అక్కడే ఉన్నారని కృష్ణారావు చెప్పాడు. వరదల ముప్పును ఎదుర్కోవడానికి మనవాళ్లు ఏం చేస్తున్నారో నేను చూడాలి. ప్రతిక్షణం వారి పనితీరును గమనించాలి. కాబట్టి ఇస్రో వాళ్లతో మాట్లాడి శాటిలైట్‌తో నా కంప్యూటర్‌కు అనుసంధానం చేయండి, నెల్లూరులో జరిగేదంతా నాకు ఇక్కడ కంప్యూటర్ స్క్రీన్ మీద కనపడుతుందని చెప్పాడు. కృష్ణారావు వెంటనే ఇస్రో ఛైర్మెన్ కిరణ్ కుమార్‌తో మాట్లాడి చంద్రబాబు కంప్యూటర్‌కు శాటిలైట్ లింకు కల్పించాడు. దాంతో నెల్లూరు నగరంలో జరిగేదంతా చంద్రబాబు కంప్యూటర్ స్క్రీన్ మీద రాసాగింది.

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ఉత్పత్తికి హెడ్ క్వార్టర్ అయిన నగరపాలక సంస్థ కార్యాలయం. నైట్‌రైడర్, ముదురుదోమల మంత్రి నారాయణతో పాటు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యేలు స్టైల్ ఆఫ్ సింహపురి వివేకా (64+), ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టి.రమేష్‌రెడ్డి, మాజీమేయర్‌లు భానుశ్రీ, పులిమి శైలజ, మాజీ ఛైర్‌పర్సన్ అనూరాధ, కమిషనర్ పివివిఎస్ మూర్తి, తాజా కార్పొరేటర్లు, మాజీకార్పొరేటర్లందరూ ఉన్నారు. నారాయణ మాట్లాడుతూ... నెల్లూరుకు భారీ వరదలు పొంచి వున్నాయి. వరదలొస్తే చాలా కొట్టుకుపోతాయి. కోట్ల సంఖ్యలో ప్రాణనష్టం సంభవిస్తుంది. మనం ప్రాణాలకు తెగించైనా ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నాడు.

(కంప్యూటర్ స్క్రీన్ మీద ఈ సీన్ చూస్తున్న చంద్రబాబు... నెల్లూరులో వుండే జనాభా లక్షల్లోనే కదా, ఈ అయ్యోరేంటి కోట్లు అంటున్నాడు. రాజకీయాల్లో లెక్కలు ఇలాగే ఉంటాయిలే, నారాయణ రూటులోకి వచ్చినట్లున్నాడు. రూపాయి పని చేసి వంద రూపాయలు పబ్లిసిటీ చేసుకునే నా సిస్టంను ఫాలో అవుతున్నట్లున్నాడని మనసులో అనుకున్నాడు.)

తర్వాత వివేకా మాట్లాడుతూ... మన మధ్య రాజకీయంగా ఎన్ని విభేధాలైనా ఉండొచ్చు. కాని వరదల నుండి ప్రాణ నష్టం సంభవించకుండా మనమంతా కలిసి కట్టుగా పోరాడాలి. ఈ విషయంలో మనమంతా ఐక్యంగా వుందాం, స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి హయాం నుండి నేటి అజీజ్ వరకు పెంచిపోషించిన ఆస్థి మన చేజారకూడదు అని చెప్పాడు.

(ఇది విన్న చంద్రబాబు మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. వీరిలో వున్న స్పిరిట్ ప్రతి జిల్లా నాయకులలో వుంటే నాతో పని లేకుండానే అన్ని జిల్లాలు బాగుపడవా అని అనుకున్నాడు.)

తర్వాత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వుండి.. తరతరాలుగా మనం కాపాడుకుంటూ వస్తున్న ఆస్థిపాస్తులను ఈ వరదలలో కొట్టుకు పోనీయం. ఈ భగీరథ ప్రయత్నానికి మా పార్టీ నుండి పూర్తి సహకారముంటుందని చెప్పాడు. అనిల్‌కుమార్ యాదవ్ కూడా ఈ మాటకు మద్దతు పలికాడు.

(వీరి మాటలు విన్న చంద్రబాబుకు కళ్లలో నీళ్లు వచ్చాయి. ప్రతిపక్ష నాయకులందరికీ ఇంతటి మంచి హృదయముంటే నా పనులకు అడ్డమేముంటుంది... వెల్‌డన్ శ్రీధర్, అనిల్ అని ఆయన మనసులోనే అభినందించారు.)

భానుశ్రీ కన్నీళ్లు తుడుచుకుంటూ... టీవీలలో వాతావరణ హెచ్చరికలు చూస్తుంటే భయమేస్తుంది... పసిబిడ్డలా పెంచాం, ఈ వరదలకు ఏమైపోతాయో ఏంటో... నా మనసంతా దిగులుగా వుంది అని అంది. అందుకు అనూరాధ నువ్వొక్కదానివే సాకినట్లు చెబుతున్నావే, నేనెంత ప్రేమగా చూసానో తెలుసా, వాటి కోసం మీకంటే నేనే ఎక్కువ కష్టపడ్డాను తెలుసా అని అంది. ఆ మాటలు విని పులిమి శైలజకు రోషమొచ్చి... ఆపండి చాలు గాని, ఆ మాటకొస్తే నేనేమన్నా తక్కువ చేసానా, నా బిడ్డలకంటే కూడా వాటినే ఎక్కువుగా చూసాను అని అంది.

(ఈ ముగ్గురి వాదనలు కంప్యూటర్ స్క్రీన్‌పై చూసిన చంద్రబాబు నెల్లూరు ప్రజలను వీళ్లు కన్నబిడ్డల్లా చూసుకున్నారు, ఈ వరదలకు వాళ్లకేమన్నా జరుగుతుందేమోనని బాధపడుతున్నట్లున్నారు అని అనుకున్నాడు.)

వెంటనే రమేష్‌రెడ్డి అందుకుని... నా హయాంలో ఏలోటూ తెలియకుండా కాపాడాను. ఇప్పుడు కూడా కాపాడేందుకు నా శక్తివంచన లేకుండా కృషి చేస్తాను అని హామీ ఇచ్చాడు.

(అది చూసిన చంద్రబాబు... శెభాష్ రమేష్, ఇన్ని రోజులకు నాకు నచ్చావు అని అనుకుని, అక్కడున్న మంత్రులతో... చూడండి వీళ్ల టీం స్పిరిట్‌ను, నెల్లూరు ప్రజలను కాపాడడానికి వాళ్లు పడుతున్న తాపత్రయం చూడండి, అక్కడ వరదలొస్తే రెస్క్యూటీంతో పనిలేదు, ఎన్‌ఎఫ్‌డిఆర్ బృందాలు అక్కర్లేదు, పోలీసు బలగాలతో, ఫైర్ సిబ్బందితో అవసరమే లేదు. విపత్తుల సమయంలో నాయకులంటే ఇలా కలిసి పనిచేయాలి... చూసి నేర్చుకోండి, అందరికీ నేర్పించండి అని అన్నాడు.)

నారాయణ వుండి... అజీజ్ వరదల నేపథ్యంలో ఎలాంటి అప్రమత్తత చర్యలు చేపట్టారని అడిగాడు. దానికి అజీజ్, సార్, మురుగుకాలువలు సురక్షితంగా వుండేలా గోడలు కట్టాం, మురికి కాలువలలోకి వరద నీళ్లు రాకుండా డైవర్షన్‌లు ఏర్పాటు చేసాం, ఆహారం కొరత రాకుండా ఉండేందుకు బ్లడ్ ప్యాకెట్లు ఏర్పాటు చేస్తున్నాం.. అని చెబుతుండగా...

(కంప్యూటర్‌లో చూస్తున్న చంద్రబాబు... వీడి భాష తగలెయ్యా బ్రెడ్ ప్యాకెట్లు అనబోయి బ్లడ్ ప్యాకెట్లు అంటున్నాడనుకున్నాడు.)

అజీజ్ కంటిన్యూ చేస్తూ బ్లడ్ ప్యాకెట్ల కోసం నెల్లూరులో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్, పెద్దాసుపత్రి బ్లడ్‌బ్యాంక్‌ల నుండే కాకుండా ఇతర జిల్లాల బ్లడ్‌బ్యాంకుల నుండి కూడా బ్లడ్‌ప్యాకెట్లు తెప్పిస్తున్నాం, ఈ వర్షాకాలంలో ఆహారం కొరత రానీయకుండా చూస్తున్నాం అని చెప్పాడు.

(ఆ సీన్ చూస్తున్న చంద్రబాబు మనసులో... నెల్లూరు జనాలు బ్లడ్ తాగి బ్రతుకుతున్నారా అని అనుకున్నాడు.)

తర్వాత నెల్లూరు నాయకుల చేత మంత్రి నారాయణ ప్రతిజ్ఞ చేయించసాగాడు.

నెల్లూరు నగరం మా మాతృభూమి, నెల్లూరు ముదురుదోమలు మా వారసత్వ సంపద. జనాలకు ఏమైనా ఫర్వాలేదుగాని ఈ వరదల్లో ఒక్క దోమను కూడా చనిపోనీయమని, వీటిని కాపాడేందుకు నిరంతరం అప్రమత్తమై పనిచేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాం... జైహింద్.

(కంప్యూటర్ స్క్రీన్ మీద ఈ ప్రతిజ్ఞ చూసిన చంద్రబాబుకు ఒక్కసారిగా కళ్లు తిరిగి కుర్చీని వదిలి పక్కనే వున్న బెడ్‌మీద పడుకున్నాడు.)

# కల్యాణ వైభవం...!



హోటల్ రాజేష్ ఇంటర్నేషనల్ అధినేత చెరుకుపల్లి రాఘవరెడ్డి - రమణమ్మల కుమారుడు అన్వేష్‌రెడ్డి - శ్వేతారెడ్డి (వెంకటగిరి వాస్తవ్యులు, నవభారత్ విద్యాసంస్థల అధినేత బీరం సుభాష్‌చంద్రారెడ్డి - కామేశ్వరిల కుమార్తె)ల కల్యాణం నవంబర్ 18వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



ఐ న్యూస్ స్టేట్ బ్యూరో మారంరెడ్డి శ్రీహరిరెడ్డి - గాయత్రి(నెల్లూరు వాస్తవ్యులు బుద్దల భాస్కర్‌రెడ్డి - వెంకటరమణమ్మల కుమార్తె)ల వివాహం డిసెంబర్ 2వ తేదీ నెల్లూరులోని టిటిడి కల్యాణ మండపంలో జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# చెన్నై వరదలపై నెల్లూరులో ఆందోళన

చెన్నైలో భారీ వర్షాల కారణంగా నెల్లూరులోని వ్యాపారస్థులు కూడా ఇబ్బంది పడుతున్నారు. అది మన రాజధాని కాకపోయినా నెల్లూరోళ్లు నిద్రలేస్తే వ్యాపారాల పని మీద వెళ్లేది చెన్నైకే! వ్యాపార లావాదేవీలకు సంబంధించి షాపింగ్ అంతా కూడా చెన్నైలోనే నిర్వహిస్తుంటారు. ఇక నెల్లూరు జిల్లా నుండి రోజూ వెళ్లే పేషంట్లు కూడా ఎక్కువే! ఈమధ్య విషజ్వరాలు ప్రబలి నెల్లూరోళ్లు ఎక్కువ సంఖ్యలో చెన్నై ఆసుపత్రుల్లో ఉంటున్నారు. వీరితో పాటు బంధువులు కూడా అక్కడే ఉంటూ, ఇప్పుడు తిండి తిప్పలకు అవస్థలు పడుతున్నారు. బయట తిందామంటే హోటళ్ళు కూడా లేక ఆసుపత్రుల్లో వండుకునే దిక్కు లేక నానా తంటాలు పడుతున్నారు. అలాగే వ్యాపారాలు, ఉద్యోగాల నిమిత్తం నెల్లూరుజిల్లాకు సంబంధించినోళ్లు చెన్నైలో ఎక్కువగా ఉంటున్నారు. చెన్నైలో వీరికేమైందోనని నెల్లూరులో వుంటున్న వారి బంధువులు ఆందోళనలో ఉన్నారు. రవాణా వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోయింది. చెన్నై వైపు వెళ్ళే రైళ్లు, బస్సులను నిలిపివేశారు. చాలామంది చెన్నై ఎయిర్‌పోర్టు నుండి విదేశాలకు ప్రయాణాలు పెట్టుకుని వున్నారు. అయితే ఎయిర్‌పోర్టులో కూడా నీళ్ళు చేరి ఎయిర్‌పోర్టునే మూసివేయడంతో వీరి ప్రయాణాలన్నీ కూడా రద్దయ్యాయి. సెల్‌ఫోన్లు కూడా పని చేయకపోవడం మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టింది. తమ బంధువులు, తమ బిడ్డల క్షేమ సమాచారం కోసం నెల్లూరులో వుంటున్నవారు ఏ సెల్‌కు ఫోన్ చేసినా రింగ్ కాకపోవడంతో వీరిలో ఆందోళన ఎక్కువైంది. మొత్తానికి చెన్నై వరదలు నెల్లూరు ప్రజలను సైతం భయపెట్టాయి.

# స్మైల్‌కు బియస్‌యన్‌యల్ & ఆరోగ్య సహాయత గుర్తింపు

నెల్లూరు రమేష్‌రెడ్డినగర్‌లోని స్మైల్ సూపర్‌స్పెషాలిటీ దంత వైద్యశాలకు బియస్‌యన్‌యల్ మరియు ఆరోగ్య సహాయతకు గుర్తింపు లభించిందని స్మైల్ గ్రూప్ ఆఫ్ డెంటల్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. బియస్‌యన్‌యల్ ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు నగదు రహిత చికిత్సలు మరియు ఎక్సైజ్ & ప్రొహిబిషన్ శాఖ వారికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసి వున్న ఆరోగ్య సహాయత హెల్త్‌కార్డులపై తమ హాస్పిటల్‌లో నగదు రహిత దంత చికిత్సలు పొందవచ్చని వివరించారు.

# భగవద్గీత పోటీలకు 'వాత్సల్య' విద్యార్థులు

జిల్లా స్థాయిలో డిసెంబర్ 20వ తేదిన నెల్లూరులో జరుగనున్న భగవద్గీత కంఠస్థ పోటీలకు వాత్సల్యకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జనహిత-వాత్సల్య కార్యదర్శి జివి సాంబశివరావు తెలిపారు. నెల్లూరు నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఆదివారం నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న భారతీయ విద్యావికాస్ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సిహెచ్ సుస్మిత(2వ తరగతి), నిషికారాజ్(7వ తరగతి) ఈ పోటీలకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను జనహిత-వాత్సల్య సంస్థల గౌరవాధ్యక్షులు సామంతు గోపాలరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డిలు అభినందించారు.

# రూ.1750 కోట్ల దాకా వరద నష్టం

- జిల్లా కలెక్టర్ ఎం.జానకి



జిల్లాలో ఈ నవంబర్ నెలలో వచ్చిన భారీ వర్షాల వల్ల మొత్తం 1750 కోట్ల రూపాయల దాకా నష్టం వాటిల్లి వుండవచ్చని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి వెల్లడించారు. సోమవారం నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్‌రూంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వరదల వల్ల జరిగిన నష్టాలను అంచనా వేసేందుకు సర్వే జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయం, ఆక్వా రంగాలకు సంబంధించి ఇంకా పూర్తిస్థాయిలో నష్టాల వివరాలు సేకరించాల్సివుంద న్నారు. ఈ నష్టాలు మరింతగా పెరగవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. త్వరలో నష్టపరిహారం విడుదలయ్యే అవకాశం కూడా వుందన్నారు. కేంద్ర బృందాలు జిల్లాలో పర్యటించి నష్టాలను పరిశీలిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

- జేసీ ఇంతియాజ్



నెల్లూరు కార్పొరేషన్, అన్ని మునిసిపాలిటీలలో కేబుల్ టివి నెట్‌వర్క్‌కు సంబంధించిన డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిగా నిర్వహించాలని నెల్లూరుజిల్లా జాయింట్‌కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని జేసి ఛాంబర్‌లో కేబుల్‌టివి ఛానెల్ యాజమాన్యాలతో డిజిటలైజేషన్ ప్రక్రియపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం సమాచార, దూరదర్శన్‌శాఖ వారి ఆదేశాల ప్రకారం యాక్ట్ ఛానల్ వారు మునిసిపాలిటీల్లో 90శాతం కేబుల్ టివి నెట్‌వర్క్‌కు సంబంధించిన డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. పెండింగ్‌పడ్డ మిగతా అన్ని మునిసిపల్ పట్టణాలలో డిసెంబర్ నెలాఖరుకల్లా ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత కేబుల్ టివి ఛానల్ యాజమాన్యాలను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.కృష్ణకిషోర్, యాక్ట్ టివి ప్రతినిధులు సుబ్బారావు, నెల్లూరు డిజిటల్ నెట్‌వర్క్ మేనేజర్ సుధీర్, సిటి కేబుల్ మేనేజర్ కిశోర్, ఆత్మకూరు టివి ఛానెల్ మేనేజర్ మధు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి సిద్ధం

- సిపిఎం మధు



వరద బాధితులందరూ కలిసికట్టుగా ముందుకొస్తే... వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు సిపిఎం సిద్ధంగా వుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేర్కొన్నారు. ఇటీవల వర్షాల కారణంగా దెబ్బతిన్న నెల్లూరు నగరంలోని మన్సూర్‌నగర్ ప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ఇళ్ళను తొలగిస్తామని అధికారులు బెదిరిస్తున్నారని, తమకు ఏ ఆధారం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మధు మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారానికి అందరూ నిరాహారదీక్ష చేసేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నెల్లూరురూరల్, నగర కార్యదర్శులు మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్, ఎ.గోపాల్, జి.నాగేశ్వరరావు, ఎస్‌కె చాన్‌బాషా, పి.సూర్యనారాయణ, ఎస్.కె.మస్తాన్‌బీ, ఎస్.కె.కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్నహస్తం అందిస్తున్న 'నెపస్మా'



నెల్లూరుజిల్లాలోని వరద బాధితులను ఆదుకోవడానికి నెల్లూరు జిల్లా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ (నెపస్మా) తమవంతు కృషి చేస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరద బాధితులకు దుస్తులను అందజేసిన నెపస్మా, 2వ తేదీ వెంగళరావునగర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. అక్కడ బాధితులకు మేయర్ అబ్దుల్ అజీజ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, కార్పొరేటర్లు ఎం.పెంచలయ్య, ఎం.వెంకయ్యాదవ్‌ల చేతులమీదుగా బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర అధ్యక్షులు యం.వి.సుబ్బారెడ్డి, నెపస్మా జిల్లా అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, నగర అధ్యక్షులు శౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారీ ఉచిత మెగా వైద్య శిబిరం

నెల్లూరు లయన్స్ క్లబ్, అపోలో హాస్పిటల్, యాక్ట్ సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నెల్లూరు నారాయణరావుపేటలోని ప్రభుత్వ మోడల్ హైస్కూలులో భారీ ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అపోలో హాస్పిటల్‌కు చెందిన స్పెషలిస్ట్ వైద్య బృందం పాల్గొని ఇటీవల సంభవించిన భారీ వర్షాల వల్ల వివిధ వ్యాధులు సోకిన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ శిబిరానికి నెల్లూరు సిండికేట్‌బ్యాంకు వారు సహాయసహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షులు తోట నాగరాజు, కార్పొరేటర్లు కుంచాల కృష్ణవేణి, వేలూరు సుధారాణి, యాక్ట్ ఆపరేషన్ హెడ్ బి.వి.సుబ్బారావు, సిండికేటు బ్యాంకు ఆర్ఎం టి.శ్రీకృష్ణ, మోడల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో బిజెపిని బలోపేతం చేయాలి

జిల్లాలో బిజెపిని మరింతగా బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి రవీంద్రరాజు పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. నెల్లూరులోని బాలపీరయ్య కళ్యాణమండపంలో మంగళవారం జరిగిన సంస్థాగత ఎన్నికల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని సూచించారు. ఈ నెల 5 నుంచి 12 వరకు గ్రామ కమిటీలు, 15 నుంచి 25 వ తేది వరకు మండల కమిటీలు, 30న జిల్లా అధ్యక్షుని ఎంపిక జరగనుందని తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలు, విధి విధానాలు, నిర్వహణపై పార్టీ నాయకులకు మార్గదర్శకాలను అందజేశారు. జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, ఎన్నికల అధికారి భానుప్రకాష్‌రెడ్డి ఈ సందర్భంగా ఆయా మండలాలకు అధికారులను ప్రకటించారు. ఎన్నికల ఇన్‌ఛార్జి కపిలేశ్వరయ్య, జిల్లా సహఇన్‌ఛార్జి భాస్కరగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, రంగినేని కృష్ణయ్య, కందుకూరి సత్యనారాయణ, వరదయ్య, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, భరత్, మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కనువిందు చేస్తున్న జలపాతాలు

నెల్లూరుజిల్లాలోని సోమశిల, పెంచలకోన, ఉదయగిరి ప్రాంతాలు పర్యాటకుల మనసులు దోచుకుంటున్నాయి. ఈమధ్య కురిసిన భారీ వర్షాలకు ఈ మూడు ప్రాంతాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. సోమశిలలో పెన్నానది ఒడ్డున వున్న సోమేశ్వరాలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొండలపై జాలువారుతున్న జలపాతాలను చూసేందుకు అందరూ ప్రత్యేక ఆసక్తి కనపరుస్తున్నారు. మన జిల్లాలోనే పర్యాటకులను విశేషంగా ఆకర్షించే సోమశిల, పెంచలకోన, ఉదయగిరి, నరసింహకొండ ప్రాంతాలున్నప్పటికీ పర్యాటక శాఖ సరైన వసతులు, రోడ్డు మార్గాలు ఏర్పాటు చేయకపోవడంతో పర్యాటకులు ఎక్కువ శాతం మంది ప్రకాశం జిల్లా భైరవకోన ప్రాంతానికి పయనమవుతున్నారు. జిల్లాలోని ఉదయగిరి కొండలు జాలువారే జలపాతాలతో కనువిందు చేస్తున్నాయి. కొండలను ముద్దాడుతున్న మేఘాలతో వాతావరణం ఊటీని తలపిస్తోంది. జలపాతాల సోయగాలను చూసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు కొండలవైపు వెళుతున్నారు. ఇందుకు తగ్గట్లుగా పర్యాటకశాఖ పర్యాటకులను ఆకర్షించేందుకు సరైన ప్రచారంతో పాటు ఆకర్షణీయమైన ఏర్పాట్లు చేయవలసిన అవసరం ఉంది.

# జెండా మార్చిన ఆనం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 2వ తేదీన ముఖ్యమంత్రి, తెలుగు దేశం అధినేత చంద్రబాబు సమక్షంలో ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు తెలుగుదేశంపార్టీలో చేరారు. నెల్లూరుజిల్లా రాజకీయాలకు సంబంధించి ఇదో సంచలనం! ఈ జిల్లాలో ప్రధాన రాజకీయవర్గం వారిదే! వాళ్ళు ఇంత తొందరగా కాంగ్రెస్‌ను వదులుతారని, తెలుగుదేశంలో చేరుతారని ఎవరూ ఊహించలేదు. కాలం కలిసొస్తే ఏదీ ఆగదన్నట్లు వాళ్ళ సైకిలెక్కే పని జరిగింది.

### కాంగ్రెస్ జీరో కాబట్టే!

విభజన పాపానికి ఒడిగట్టిన కాంగ్రెస్ ఈ రాష్ట్రంలో జీరో అయ్యింది. ఆ పార్టీలో వుండి అయిదు, లేదా పదేళ్ళ కష్టపడితే ఆ తర్వాతయినా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న గ్యారంటీ లేదు. మొన్న ఎన్నికల దాకా ఆ పార్టీలో ఉండడమే గొప్ప. ఇక కాంగ్రెస్‌లో వుంటే అధికారం, పదవులు వుండవు. అధికారం లేకుండా సొంత ప్రాభవాన్ని నిలుపుకోవడం కష్టం. అందుకే కాంగ్రెస్‌ను వదిలేయాలని వాళ్ళు నిర్ణయించుకున్నారు.

### మొదటి చూపు వైకాపా వైపే!

అయితే ఆనం బ్రదర్స్ మొదట వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాలనుకున్నారు. వీరికి అత్యంత సన్నిహితుడైన బొత్స సత్యనారాయణ వైకాపాలోనే ఉండడంతో, వీరి చేరిక కూడా సులభమవుతుందనుకున్నారు. అయితే ఆనం సోదరులను పార్టీలో చేర్చుకోవడాన్ని వైకాపా జిల్లా నాయకులు కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో జగన్ వాళ్ళకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. అందుకే తప్పని పరిస్థితుల్లో వాళ్ళు తెలుగుదేశంలో చేరడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### నాయకత్వం బలహీనంగా ఉండబట్టే...

మాట తప్పం, మడమతిప్పం అనే పాలసీలు ప్రజలకిచ్చిన హామీల విషయంలో కరెక్టేమోగాని, రాజకీయాలు చేయడంలో పనికిరావు. 2004లో వైయస్ సిఎం అయ్యాక కాంగ్రెస్‌పార్టీని పటిష్టం చేయడం కోసం తెలుగుదేశం నుండి ఎంతోమంది నాయకులను లాగేసుకున్నారు. కాని జగన్ 2014ఎన్నికలప్పుడు కాంగ్రెస్‌ను వదిలి వస్తామన్న నాయకులను వద్దన్నాడు. ఇప్పుడు ఆనం బ్రదర్స్ విషయంలోనూ అదే జరిగింది. కాని చంద్రబాబు రాజకీయ అనుభవజ్ఞుడు. మాట తప్పడం, మడమ తిప్పడం వంటి పదాలను ఆయన పెద్దగా నమ్మడు. ఏ టైంకు ఏది చేయాలో అది చేసుకుంటూ పోతాడు. జిల్లాలో ఆనం సోదరుల అవసరం ఆయనకుంది. జిల్లాలో తెలుగుదేశం బలహీనంగా వుంది. 2014 ఎన్నికల్లో రెండు లోక్‌సభ, 10అసెంబ్లీలకు గాను తెలుగుదేశం గెలిచింది 3అసెంబ్లీలే! ఆనం సోదరులను చేర్చుకుంటే నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలలో కూడా పట్టు పెంచుకోవచ్చు. అదీగాక ఈమధ్య చంద్రబాబు సొంతంగా చేయించిన సర్వేలో ఇప్పటికిప్పుడు 10అసెంబ్లీలకు ఎన్నికలు పెడితే తెలుగుదేశానికి ఒక్క సీటు కూడా రాదని రిపోర్ట్ వచ్చిందని తెలిసింది. అందుకే ముందుచూపుతో వీరిని చేర్చుకున్నారు.

### ఎవరు మొత్తుకున్నా లాభం లేదు

ఆనం బ్రదర్స్‌ను చేర్చుకోవడానికి చంద్రబాబు డిసైడ్ అయ్యాడు. జిల్లా నాయకులంతా వారిని తీసుకోవడాన్ని నిరసిస్తూ మేమంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామన్నా కూడా చంద్రబాబు వాళ్ళను తీసుకుని ఉండేవాడు. వాళ్ళను తీసుకునేముందు జిల్లా నాయకులతో ఆయన కంటి తుడుపుగా ఒక మీటింగ్ పెట్టాడంతే! అది కూడా వాళ్ళ గౌరవానికి భంగం కలిగించకూడదని! ఆనం వాళ్ళొస్తే మేం రాజీనామా చేస్తామని ఎవరైనా అనుంటే చంద్రబాబు అలాగే చేయమని చెప్పుండేవాడు. వాళ్ళను తీసుకోవడంలో ఆయన అంత బలంగా ఫిక్సయ్యాడు. ఇక ఆనం వాళ్లకు ఆత్మకూరు నియోజకవర్గ బాధ్యతలు మాత్రమే అప్పగించినట్లు, నెల్లూరు టౌన్‌లో జోక్యం చేసుకోవద్దని చంద్రబాబు వారికి చెప్పినట్లు వార్తలొచ్చాయి. గుడారంలోకి ఒంటె మొదట తలకాయ పెడుతుంది, ఆ తర్వాత మావటివాడు బయటకు పోవాల్సి వస్తుంది. ఆనం వాళ్లు చేరాక పార్టీ అనే గుడారం పరిస్థితి కూడా అంతే!

### వివేకా లేకుండా ఎందుకు?

ఆనం సోదరులలో వివేకాను వద్దని ఆనం రామనారాయణరెడ్డిని మాత్రమే చేర్చుకోవాలని జిల్లా నాయకులు చంద్రబాబుకు సూచించారు. చంద్రబాబు అమాయకుడా? వివేకా లేకుండా రామనారాయణరెడ్డిని చేర్చుకుని ఏం చేయాలి? అప్పుడు 'ఆనం' వాళ్ళు పార్టీలో చేరారన్న ముద్ర ఎలా వస్తుంది. అసలు జిల్లా కేంద్రమైన నెల్లూరులో పార్టీ పట్టు పెంచుకోవాలంటే వివేకా అవసరం. కాబట్టి వివేకా లేకుండా కేవలం రామనారాయణరెడ్డి ఒక్కడే పార్టీలో చేరతానంటే చంద్రబాబు ఒప్పుకునేవాడు కాదు.

### ఆనంపై విమర్శలు...

నిన్నటి దాకా చంద్రబాబును తిట్టి ఇప్పుడు ఆయన నాయకత్వంలో ఎలా పనిచేస్తారని ఆనం బ్రదర్స్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే చంద్రబాబన్నా నయం. బాబు కంటే వీళ్లు జగన్‌ను ఇంకా ఘోరంగా తిట్టారు. వైకాపాలో చేరుంటే ఈ విమర్శలు ఇంకా ఎక్కువై వుండేవి.

ఆనం సోదరులకు ఒక రాజకీయ ఆశ్రయం దొరికింది. అలాగే జిల్లాలో బలహీనంగా వున్నామనుకున్న తరుణంలో చంద్రబాబుకు బలమైన నాయకత్వం దొరికింది. కాకపోతే గత కొన్నేళ్లుగా ప్రతిపక్షంలో వున్నప్పుడు ఆనం వారితో పోట్లాడి కొమ్ములు నలగ్గొట్టుకుని, ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి ఒంట్లో సత్తువ తెచ్చుకుని వారి కొమ్ములు వంచాలనుకున్న తెలుగుదేశం నాయకులంతా బకరాలయ్యారు.

తమ బాసులతో పాటూ తామూ కూడా తిట్లపురాణాన్ని సాగించిన అనుయాయులు కూడా నేడు తమ నాలుకర్కరుచుకుని చంద్రబాబుకే జై అనడం మొదలెట్టారు.

ఆనం రాక పార్టీకి నష్టమో లాభమో అన్న రాజకీయ భీష్ముల ప్రశ్నలపై మరో సందర్భంలో చర్చించుకుందాం. రాజకీయమా వర్ధిల్లు.

# 'రెడ్ల'కే పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

కాపు, కమ్మ, బిసి ప్రాబల్యం కలిగిన అనంతపురం, గుంటూరు, కృష్ణ, ఉభయగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తెలుగుదేశంకు మెజార్టీ సీట్లు వచ్చాయి. రెడ్ల ప్రాబల్యమున్న కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మాత్రం వైకాపాకు మెజార్టీ సీట్లొచ్చాయి. మొన్న మెజార్టీలు వచ్చిన జిల్లాల్లో 2019ఎన్నికల్లో ఇదే బలముంటుందనే నమ్మకం లేదు. అందుకని మైనస్ పడ్డ జిల్లాల్లో బలం పెంచుకోవాలి. అందుకనే చంద్రబాబు నెల్లూరు, ప్రకాశం, కడప, కర్నూలు జిల్లాలపై ప్రత్యేకదృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ జిల్లాల్లో వున్న ప్రధాన రెడ్ల నాయకులను పార్టీలో చేర్చుకోవడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో కూడా అగ్రభాగం ఆ వర్గం నాయకులకే ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించాడని తెలుస్తోంది. ఈ నాలుగు జిల్లాల్లో రెడ్ల పెత్తనం పెంచేందుకే చంద్రబాబు మొగ్గు చూపుతున్నాడని సమాచారం.

# కర్షకుల కడగండ్లు

(2వ పేజీ తరువాయి)

పరిశీలనలు.. ప్రతిపాదనలు చేసుకున్నంతమాత్రాన ఎలాంటి ప్రయోజనం వుండదు. అలాంటి మొక్కుబడి ప్రహసనాలు ఎన్నాళ్ళు జరిగినా.. ఎన్నేళ్ళు జరిగినా ఇంతే. ఈ పరిస్థితి ఇంకా ఎంతకాలం?.. ప్రజలు ఎంతకాలం ఇలా బాధలు పడుతుండాలి?.. పూళ్ళమీదికి, ఇళ్ళలోకి వచ్చే వరదనీటిని కూడా మనం నియంత్రించుకోలేమా?.. ముందుగా వాటికి అడ్డుకట్టలు వేసుకోలేమా?..ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వున్న ఈ రోజుల్లో కూడా వానలొస్తే, వరదనీరు ఇళ్ళవద్దకు ముంచుకొస్తే జనం గడప దాటలేని పరిస్థితి వస్తోందంటే ఇంకా మనం ఎక్కడున్నామో ఆలోచించుకోవాలి. నెల్లూరు నగరంలోనే ట్రంకురోడ్డు నుంచి వేదాయపాళెంకు రాలేని దుస్థితి. మాగుంట లేఅవుట్ నుంచి ట్రంకురోడ్డుకు రాలేని పరిస్థితి. వరదనీరు పొంగి రోడ్లలోకి ప్రవహిస్తుంటే పరమేశ్వరినగర్, మన్సూర్‌నగర్ ప్రాంతాల్లో బోట్లు వేసుకుని రోడ్డు దాటాల్సివచ్చిందంటే జిల్లా అధికారయంత్రాంగమంతా వున్న, జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోనే ఇలాంటి దుస్థితి రావడం ఎంత అప్రదిష్ట..ఎంత బాధాకరం?..ఎక్కడ చూసినా వరదనీళ్ళతో.. ఇది నెల్లూరా-నీళ్ళూరా అనిపించిందంటే అతిశయోక్తి కాదు. చివరికి సాక్షాత్తూ ముఖ్యమంత్రి వచ్చి జాటీ విదిలించినదాకా అధికారయంత్రాంగపు గుర్రపుబండి కదలకపోవడం ఎంత విచారకరం?.. ఈ దుస్థితి ఇకనైనా మారాలి. అందుకు ప్రభుత్వం తక్షణం సమాయత్తం కావాలి.అధికారులు, ప్రజాప్రతినిధులు, నిపుణులు అందరూ కలిసి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ఒక కొత్త కార్యాచరణ పథకానికి, కొత్త వ్యవస్థను రూపొందించేందుకు సమాయత్తం కావాలి. అందుకు ఇదే సరైన సమయం కూడా.

### నీటి వనరుల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థ అత్యవసరం :

పట్టణ ప్రాంతాల్లో వున్న నీటివనరులు, నదీ పరీవాహక ప్రాంత నిపుణుల బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూంటే ప్రమాదాల నుంచి మనల్ని మనం రక్షించుకోలేమా?.. ఇకనైనా, పట్టణ-గ్రామీణ ప్రాంతాల్లో వున్న చెరువు కట్టలు, కాలువలు, వాగుల వంకలు తదితర నీటివనరుల పరిరక్షణకు, వాటి పరిస్థితులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసునే ప్రత్యేక వ్యవస్థ ఒకటి జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు అందుబాటులో వుండేవిధంగా తప్పనిసరిగా వుండాలి. అందుకు అవసరమైతే ప్రత్యేక ఉత్తర్వులతో కొత్త చట్టం తెచ్చయినా సరే, ప్రభుత్వం ఆ సరికొత్త వ్యవస్థకు రూపకల్పన చేయాలి. జిల్లా ఉన్నతాధికారుల సారధ్యంలో, మండల కేంద్రాల్లో వున్న నీటిపారుదల సిబ్బంది, పోలీసు సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో పాటు, ఆయా ప్రాంతాల్లో సేవానిరతి కలిగిన ప్రముఖులు, దాతలు, స్వచ్ఛంధసేవాసంస్థలవారు, స్థానికంగా వున్న యువత, మహిళా ప్రతినిధులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి. చెరువు కట్టల పరిరక్షణకు, నీటి వనరుల సంరక్షణకు అవసరమైన సూచనలు చేసేందుకు అవసరమైన నిపుణులతో కూడిన వారిని కూడా ఈ కమిటీల్లో నియమించాలి. ఈ కమిటీలు రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా పనిచేసేవిధంగా వుండాలి. ఎప్పటికప్పుడు చెరువులు, నీటి వనరులను పరిశీలిస్తూ సంబంధిత వివరాలు అందరికీ అందుబాటులో వుండేలా చూసుకోవాలి. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు ఆ విపత్తుల బారినపడకుండా ఎప్పటికప్పుడు తగు చర్యల నిమిత్తం జిల్లా ఉన్నతాధికారులను సదా అప్రమత్తం చేస్తుండడం ఈ కమిటీ బాధ్యత వహించేలా చూడాలి. తద్వారా, జిల్లా నుంచి అవసరమైతే రాష్ట్రస్థాయి నుంచి తక్షణ సాయం బాధిత ప్రాంతాలకు వెంటనే అందేందుకు వీలుంటుంది. అలా కాక, ఏ వానలొచ్చినా వరదలొచ్చినా ఎవరో ఒకరు వచ్చి సాయం చేస్తారులే అనే భావనతోనే వుంటే, జరగరాని ఘోరం జరిగిపోయాక బాధపడీ ప్రయోజనం వుండదు. ప్రకృతి విపత్తు ఎప్పుడు ఎటువైపు నుంచి వచ్చి పైనపడుతుందో తెలియదు కనుక ఎల్లవేళలా అప్రమత్తంగా వుండడం ఒక్కటే మనం చేయగలిగింది. అటు ప్రభుత్వం-ఇటు అధికారులు, నాయకులు అందరూ ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారానే ఇలాంటి విపత్తులను కొంతమేరకైనా ఎదుర్కోగలం. సంబంధిత నిపుణులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు అందరూ కలసి చర్చించుకుని, ఇకనైనా చెరువు కట్టలు తెగిపోకుండా, వాగులు వంకలు ప్రజలను, పంటపొలాలను నీటముంచకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటే బావుంటుందో నిర్ణయించుకుని శాశ్వత ప్రాతిపదికపై ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, దాని అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయడం ఒక్కటే సరైన మార్గం. ప్రకృతి విపత్తులకు భవిష్యత్తులోనైనా ప్రజలు గురికాకుండా ప్రభుత్వం ఈ కమిటీల ద్వారా సరైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం ఎంతైనా శ్రేయస్కరం.








# మహా న(సా)గరం

- కన్నీటి వరదలో చెన్నై
- మిద్దెలు మేడలు సైతం మునక
- విలవిలలాడుతున్న జనం
- సహాయక చర్యలు ముమ్మరం
- వందేళ్ళలో కనీవినీ ఎరుగని విపత్తు

*చెన్నై మహానగరం మహా సాగరమైంది. ఎటుచూసినా జలవిలయమే. ఏ వీధి చూసినా జనుల ఆర్తనాదాలే. ముడిచూరు మునిగిపోయింది. వలసరవాక్కం వాగైంది. సైదాపేట చెరువైంది. అడయార్ అతలాకుతలమైంది. తాంబరం, అంబత్తూరు, జాఫర్‌ఖాన్‌పేట ఇలా ఎన్నో ప్రాంతాలు జలప్రవాహాలతో, జనం హాహాకారాలతో హోరెత్తుతున్నాయి. గత 130 ఏళ్ళలో ఎన్నడూ చూడని భారీవర్షాలు, పొంగిన నదులు వాగులు వంకలు నగరంపై విరుచుకుపడడంతో ఉప్పొంగిన వరదనీటిలో జనం ఆర్తనాదాలు. చెన్నై కలలో కూడా ఊహించని ఈ విపత్తుకు జనం విలవిల్లాడిపోతున్నారు.*

చెన్నై..ఇప్పుడది ఒక సాగరమో..మహాసముద్రం మధ్యలో మునిగిపోతున్న ద్వీపమో!..అన్నట్లుగా ఎక్కడ చూసినా జలరక్కసి కోరలు చాచి ప్రజలను నానా ఇక్కట్లకు గురిచేస్తోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న కుంభవృష్టితో చెన్నై ఛిన్నాభిన్నమైంది. అందాల మహానగరం వరద భీభత్సానికి భీతిల్లిపోతోంది. వదలని వానతో, ఈదురుగాలులతో జనం గజగజవణికిపోతున్నారు. ప్రాణాలు అరచేత పట్టుకుని బిక్కుబిక్కుమం టున్నారు. రోడ్లు వరదనీటి కాలువలయ్యాయి. జనావాసాలు జలదిగ్భంధంలో చిక్కుకుపోయాయి. మేడలు, మిద్దెలు, భవంతులు, అపార్ట్‌మెంట్లు ఎక్కడ చూసినా వరదనీటి ప్రవాహమే. ఎక్కడ చూసినా బాధితుల హాహాకారాలు..రోదనలు..ఆర్తనాదాలతో చెన్నై శోకసాగరమైంది.

తాంబరం, సైదాపేట తదితర ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా వుంది. కొన్ని ప్రాంతాలకు సహాయ బృందాలు సైతం చేరుకోలేని దుస్థితి. ఈ వర్షాలు వరదల మూలంగా బుధవారం నాటికే సుమారు 200 మంది దాకా మృతి చెందినట్లు అంచనా. చెన్నై నగరాన్ని వరద ముంచెత్తడంతో వేలచ్చేరి, ముడిచూర్, మడిపాక్కం, కొట్టూర్‌పురం, గుండి, మాంబళం, నుంగంబాక్కం, అన్నానగర్, మైలాపురం, ఉపపక్కం, పల్లవరం, ఎగ్మూర్, వడపళని, వలసరపాక్కం, మొగప్పయార్, ఆవది, అంబత్తూర్ తదితర ప్రాంతాలు జలవలయంలో చిక్కుకుపోయాయి. చెంబరబాక్కం బ్రిడ్జి నీటమునిగిపోయింది. అడయార్ నది చెంతనే వున్న హౌసింగ్‌బోర్డు కాలనీల్లో వరదనీరు రెండో అంతస్తు దాకా చేరుకున్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థమవుతుంది. ప్రజలంతా మేడలు, మిద్దెల పైకెక్కి ప్రాణాలు కాపాడుకుంటున్నారు. ఇక లోతట్టు ప్రాంతాలన్నీ నీటిఅడుగున ఎక్కడున్నాయో కూడా అర్థం కాని పరిస్థితి. ఎక్కడచూసినా అంతా వరదప్రవాహమే. స్కూళ్ళు, కాలేజీలు, ఆస్పత్రులు, కార్యాలయాలు, కాలనీలు, జనావాసాలు, విమానాశ్రయం అన్నీ జల దిగ్బంధంలోనే వున్నాయి. ఎగ్మూర్‌లో రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. చెన్నై ఎయిర్‌పోర్ట్ మూసివేయడంతో ఇక్కడికి విమానాల రాకపోకలన్నీ రద్దయిపోయాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో సెల్‌ఫోన్లకు ఛార్జింగ్ లేక ఎవరెక్కడున్నారో, ఏ స్థితిలో వున్నారో తెలియక ప్రజలు పడుతున్న బాధలు మాటల్లో చెప్పలేనివి. ఏటిఎంలు కూడా మూతపడ్డాయి. బకింగ్‌హామ్ కెనాల్‌కు గండి పడింది. రోడ్లు ఎక్కడికక్కడ తెగిపోయి, నీటి మడుగులయ్యాయి. రాకపోకలన్నీ బంద్ అయిపోయాయి. రైళ్ళు, బస్సులు, విమానాలు అన్నీ రద్దయ్యాయి. సమాచారవ్యవస్థ అస్తవ్యస్తమైంది. విద్యుత్ లేక చెన్నై కటిక చీకటిలో శోకదేవతే అయింది. వేలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఐటి కంపెనీలున్న ప్రాంతాలన్నీ వరదనీటిలోనే విలవిల్లాడుతున్నాయి. ఆహారం, నిత్యావసరాలు దొరక్క ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు. తాగడానికి కనీసం మంచినీళ్ళు కూడా దొరకని స్థితి. పసిబిడ్డలకు పాలు కానీ, రోగులకు మందులు కానీ అందించలేని దయనీయమైన పరిస్థితిలో చెన్నై విలపిస్తోంది. ఆకలికి కడుపులో పేగులు సుళ్ళు తిరుగుతున్నా కన్నీళ్ళే తప్ప తినడానికి, తాగడానికీ ఏమీ దొరకని దుస్థితిలో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ జలవిలయంలో ఎవరిపాటికి వారు స్వీయరక్షణ చేసుకోవాల్సిన పరిస్థితి రావడంతో ఇళ్ళను వదిలేసి ప్రాణాలు కాపాడుకోవడానికి జనం పడుతున్న బాధలు వర్ణనాతీతం. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. సైన్యం, వైమానిక దళం, అధికారులు, పోలీసు యంత్రాంగమంతా బాధిత ప్రజలకు సహాయం అందించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారు.

ఈ 137 ఏళ్ళలో చెన్నై నుంచి నిరాఘాటంగా వెలువడుతున్న 'హిందూ' దినపత్రిక తొలిసారిగా బుధవారం సంచిక ముద్రణను నిలిపేయాల్సివచ్చిందంటే చెన్నైలో సమాచారవ్యవస్థ ఎంత దయనీయంగా మారిందో తెలుస్తుంది. కాగా, ఇంకా మరో 48 గంటలదాకా భారీవర్షాలు ముంచెత్తనున్నాయనే సమాచారం ప్రజానీకాన్ని బెంబేలెత్తిస్తోంది. మరో వారంరోజుల దాకా వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణశాఖ తెలియజేస్తున్న నేపథ్యంలో, చెన్నైకి వచ్చిన ఈ వరద ముప్పు మరెంత కష్టాన్నీ, నష్టాన్నీ కలుగజేస్తుందో ఎవరూ వూహించలేకపోతున్నారు. దేశంలోనే నాల్గవ పెద్ద నగరమైన చెన్నైకి ఇప్పుడు ఈ వరద ధాటికి ప్రపంచంతో సంబంధాలన్నీ తెగిపోవడం ఎంత దురదృష్టకరం!..ఈ ఘోర విపత్కర పరిస్థితుల్లో అక్కడి ప్రజలందరినీ ఆదుకోవడానికి కేంద్రప్రభుత్వమే కాక, దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలూ, సమాజసేవాతత్పరులూ, దాతలూ అందరూ కలసి మానవతా దృక్పధంతో బాధితులను ఆదుకోవాల్సివుంది. వరదదెబ్బకు తల్లడిల్లుతున్న బాధిత ప్రజానీకానికి అండగా మేమున్నామంటూ..ప్రతిఒక్కరూ తమవంతు చేయూతను అందించాల్సి వుంది.

# చంద్రబాబు సారధ్యం మన అదృష్టం

### - కావలి 'జనచైతన్య యాత్ర'లో తేల్చిచెప్పిన నారాయణ



ఈ కష్టకాలంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండడం మన పూర్వజన్మ సుకృతమని మున్సిపల్ మంత్రి పి.నారాయణ చెప్పుకొచ్చారు. 1వ తేదీ కావలి మండలం గౌరవరంలో ఆయన జనచైతన్యయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత పీకల్లోతు అప్పుల్లో వున్నాం. 16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో పాలన మొదలుపెట్టాం. ఎన్ని లోటుపాట్లున్నా చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాడన్నారు. 16నెలల కాలంలో వంద హామీలను నెరవేర్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చేతిలో చిల్లర లేకున్నా చంద్రబాబు విజన్‌తోనే రాష్ట్రంలోని పథకాలు, పనులన్నీ అమలవుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలోనే బోగోలు మండలం ముంగమూరు బ్రిడ్జి సమస్యను మంత్రి స్వయంగా పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పిల్లలతో ముచ్చటించిన మంత్రి, అక్కడి టాయిలెట్ల సమస్యను, ఆటస్థలం లేని పరిస్థితిని చూసి 15రోజుల్లో చక్కదిద్దాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి కావలి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



- స్నేహానికి బాబు బహుమానం

# ఎస్ఎఫ్‌సి ఛైర్మన్‌గా జయరామిరెడ్డి

నెల్లూరులోని మాదరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి బావగారు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అత్యంత సన్నిహితుడు, స్నేహితుడు అయిన వీరపరెడ్డి జయరామిరెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చిత్తూరుజిల్లా తిరుపతికి చెందిన జయరామిరెడ్డి గతంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రిజిష్ట్రార్‌గా, హయ్యర్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా పనిచేశారు. ఉద్యోగంలో వుండగానే చంద్రబాబు కోరడంతో స్వచ్ఛంధంగా ఉద్యోగ విరమణ చేసి తెలుగుదేశంపార్టీ విధుల్లో చేరారు. దాదాపు 15ఏళ్ళుగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ కార్యక్రమాలన్నీ జయరామిరెడ్డే పర్యవేక్షిస్తున్నారు. చంద్రబాబుకు ఆయన అత్యంత నమ్మకస్తుడు. ఒకప్పుడు ఎస్వీ యూనివర్శిటీలో ఇద్దరూ స్నేహంగా ఉంటూ చదువుకున్నారు. యూనివర్శిటీలో జరిగిన 'రెడ్డి-కమ్మ' గొడవల్లో కూడా వీరి స్నేహం చెదరలేదు. ఆ స్నేహాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. తనకు అత్యంత నమ్మకస్తుడు కాబట్టే చంద్రబాబు ఎంతో కీలకమైన ఎస్ఎఫ్‌సి ఛైర్మన్ బాధ్యతలను జయరామిరెడ్డికి అప్పగించారు. కంగ్రాట్స్ జయరామిరెడ్డి!




జననం 4-8-1946 | మరణం 22-11-2015

స్వర్గీయ తవ్వా రంగయ్య గారు

ప్రెసిడెంట్: శ్రీ పాండురంగ అన్నదాన సమాజం (2002-2015)

అధినేత: శ్రీనివాస యారన్ కంపెనీ, తవ్వా రంగయ్య కళ్యాణ మండపం

**అమృతమూర్తికి అశ్రుతాంజలి**

"మీ ఆకస్మిక మరణం మాకు అశనిపాతం
మా ఉజ్వల భవిష్యత్తుకు మీ నిరంతరకృషి మాకు ఆదర్శప్రాయం.
వ్యక్తిగా మీరు తెచ్చుకొన్న పేరు ప్రతిష్టలు మాకు గర్వకారణం"

మా ఇంటి దైవం శ్రీ తవ్వా రంగయ్య గారు

22-11-2015వ తేదీన స్వర్గస్థులైనారు. వారి పవిత్ర ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

శోకతప్తహృదయాలతో...

భార్య: తవ్వా అనసూయ

కుమారుడు- కోడలు
తవ్వా బలరామ్ - లక్ష్మీలావణ్య
మనుమరాలు: లక్ష్మీశ్రావ్య మనుమడు: పవన్‌శ్రేయాంత్

కుమార్తె - అల్లుడు
కమల-జాలుగంటి విజయమనోహర్‌గుప్తా
మనుమడు: కార్తీక్ మనుమరాలు: ప్రసన్నలక్ష్మి

కుమార్తె - అల్లుడు
కరుణ-మంచికంటి శ్రీనివాసులు
మనుమరాండ్రు: సుశ్మిత, సాయి సుకీర్తి
మరియు కుటుంబ సభ్యులు

BR@94402 76226


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com